www.epaper.asthramdaily.com

RNI : TGTEL/25/A1872

సామాన్యుడి అస్త్రం

తెలుగు దిన పత్రిక

సంగారెడ్డి- హైదరాబాద్ | శనివారం, అక్టోబర్ 17,2026 | ఎడిటర్: పి. జయరాం | సంపుటి: 1 | సంచిక:223 | పేజీలు: 8 | వెల: రూ.5/-

పండుగ పూట ప్రజలకు ఊరట

దసరా పండుగ సెలవుల నేపథ్యంలో తెలంగాణలో ఎటువంటి కూల్చివేతలు చేపట్టవద్దని, ఆస్తులను ఖాళీ చేయించే చర్యలకు దిగవద్దని రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అక్టోబర్ 17 నుంచి 25వ తేదీ వరకు ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటాయని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రభుత్వం, ప్రైవేట్ వ్యక్తుల మధ్య వివాదంలో ఉన్న భూములు, ఆస్తుల విషయంలో ఈ ఆదేశాలు వర్తిస్తాయని పేర్కొంది.ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో పాటు హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా)కి తగిన ఆదేశాలు జారీ చేయాలని రెవెన్యూ శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. అయితే, వివాదాస్పద ఆస్తుల విషయంలో ప్రైవేట్ వ్యక్తులు లేదా సంస్థలు చట్టప్రకారం నోటీసులు జారీ చేసేందుకు ఎటువంటి అభ్యంతరం లేదని కోర్టు స్పష్టం చేసింది.ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం చింతగూడెం గ్రామానికి చెందిన శీలం లీలావతి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ ఎన్.వి. శ్రావణ కుమార్ ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది.



విచారణకు సై

- సిట్టింగ్ జడ్జీతో జరిపించాలి
- పదవి నిలుపుకునేందుకే విదేశీ బొగ్గు కమీషన్లకు కుట్ర
- సింగరేణి, విద్యుత్, సాగునీటి సంక్షోభాలకు కాంగ్రెస్
- ప్రభుత్వమే కారణం: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2

జీవన్ రెడ్డిపై అడ్లూరి లక్ష్మణ్ ఫైర్

- బీఆర్ఎస్ నేత జీవన్ రెడ్డి వ్యాఖ్యలపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆగ్రహం
- పార్టీ మారగానే కల్వకుంట్ల కుటుంబం మంచిదైపోయిందా అని ప్రశ్న
- ఎండిన ఒక్క పాలమైనా చూపించాలని జీవన్ రెడ్డికి సవాల్





తెలంగాణకు హ్యుందాయ్

- జహీరాబాద్‌లో గ్లోబల్ ఆర్ అండ్ డీ కేంద్రం
- 8,528 కోట్ల పెట్టుబడి.. 678 ఎకరాల్లో అభివృద్ధి త్వరలోనే భూమి పూజ
- కంపెనీ ప్రతినిధుల వెల్లడి
- హ్యుందాయ్' యాజమాన్యానికి సీఎం రేవంత్ విజ్ఞప్తి
- పెండింగ్ అనుమతులు పూర్తిచేయాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం
- కార్ల తయారీ ప్లాంట్ పెట్టాలని యాజమాన్యానికి పిలుపు
- సహాయ సహకారాలు అందిస్తామని హామీ

2

హైదరాబాద్, సామాన్యుడి అస్త్రం

తెలంగాణను కార్ల తయారీకి అనువైన ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి(తెలిపారు. హైదరాబాద్‌లో హ్యుందాయ్ కార్ల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని ఆ సంస్థ యాజమాన్యాన్ని కోరారు. రాష్ట్రంలో తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు అన్ని రకాల సహాయ సహకారాలు అం దిస్తామని సీఎం హామీ ఇచ్చారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న హ్యుందాయ్ గ్లోబల్ ఆర్ అండ్ డీ కేంద్రానికి సంబంధించిన పెం డింగ్ అనుమతులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.శుక్రవారం బోధి పెవిలియన్‌లో హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ (హెచ్ఎంఐఈ) మేనేజింగ్ డైరెక్టర్ చాం గ్యూన్ చో నేతృత్వంలోని ప్రతినిధి బృం దం సీఎం రేవంత్‌తో సమావేశమైంది. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, జహీరాబాద్‌లో ప్రతిపాదిత ప్రాజెక్టు పురోగతిపై చర్చించారు.

రాహుల్ తాటాకు చప్పుళ్లకు భయపడం

- కేంద్ర ప్రభుత్వాన్ని కూల్చేందుకు విపక్షాలు కుట్ర చేస్తున్నాయని ఆరోపణ
- పది నెలల్లో మోదీ సర్కార్ పడిపోతుందని దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శ
- 2029 వరకు మోదీ ప్రధానిగా ఉండాలని ప్రజలు తీర్పు ఇచ్చారని వ్యాఖ్య



2

రైతులను త్యాగాలు కోరడమా?

- ఎల్ నినో ప్రభావంపై రేవంత్ ప్రభుత్వం విఫలమైందని కవిత విమర్శ
- ముందస్తు హెచ్చరికలు ఉన్నా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని ఆరోపణ



రేవంత్ సన్నిహితులకు మెడికవర్‌లో వాటాలు

- మెడికవర్ వ్యవహారంలో సీఎం రేవంత్‌కు బీఆర్ఎస్ నేత క్రిశాంక్ సవాల్
- సీఎం కుటుంబ సన్నిహితులకు వాటాలున్నాయంటూ ముగ్గురి పేర్ల వెల్లడి

2

హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం

మెడికవర్ ఆసుపత్రి వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ బహిరంగ సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి కుటుంబానికి అత్యంత సన్నిహితులైన వ్యక్తులకు మెడికవర్ ఆసుపత్రితో పాటు ఇతర అనుబంధ సంస్థల్లో వాటాలు ఉన్నాయని ఆరోపిస్తూ, అందుకు సంబంధించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయంటూ సోషల్ మీడియాలో ఒక వీడియోను విడుదల చేశారు.మెడికవర్‌లో తన కుటుంబానికి వాటాలున్నాయని నిరూపించాలని



రేవంత్ రెడ్డి డిమాండ్ చేసిన నేపథ్యంలో క్రిశాంక్ ఈ వీడియోతో స్పందించారు.

పిల్లల సోషల్ మీడియా భద్రత

- సోషల్ మీడియా ముప్పు నుంచి పిల్లల రక్షణపై కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసు
- పటిష్ఠమైన నియంత్రణ, వయసు నిర్ధారణ ఉండాలని కోరిన పిటిషనర్లు

2

- ప్రస్తుత చట్టాలు సరిపోవని, పిల్లలపై తీవ్ర ప్రభావం పడుతోందని పిటిషన్‌లో వెల్లడి



న్యూఢిల్లీ, (సామాన్యుడి అస్త్రం)

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల వల్ల పిల్లలు ఎదుర్కొంటున్న ప్రమాదాల నుంచి వారిని రక్షించేందుకు సమగ్రమైన, పటిష్ఠమైన నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందించింది. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు విచారణ చేపట్టింది.

సికింద్రాబాద్‌లో కేజేఆర్ గార్డెన్ కూల్చివేత

- సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని కేజేఆర్ గార్డెన్ కూల్చివేత
- అక్రమ ఫంక్షన్ హాల్‌గా నిర్మించారని అధికారుల చర్యలు

హైదరాబాద్, (సామాన్యుడి అస్త్రం)

సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో దశా బ్దాలుగా వివాదాస్పదంగా ఉన్న కేజేఆర్ గార్డె న్‌ను కంటోన్మెంట్ బోర్డు అధికారులు శుక్ర వారం పూర్తిగా నేలమట్టం చేశారు. నిబం ధనలకు విరుద్ధంగా అక్రమంగా నిర్మించి, ఫంక్షన్ హాల్‌గా నిర్వహిస్తున్న ఈ కట్టడంపై అధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. న్యాయస్థాన ఆదేశాల



2

మేరకు ఈ కూల్చివేత ప్రక్రియను చేపట్టారు.

మార్నింగ్ వాక్‌లో విషాదం



మిగతా 2వ పేజీలో..

- సూర్యాపేట సమీపంలో వాకింగ్‌కు వెళ్లిన ముగ్గురిని ఢీకొట్టిన డీసీఎం
- ఈ ఘటనలో గుర్రం సైదులు, ఆలకుంట నాగరాజు మృతి

2

సూర్యాపేట, (సామాన్యుడి అస్త్రం)

సూర్యాపేట జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. జిల్లా కేంద్రానికి సమీపంలోని బలేంల స్టేజీ వద్ద జరిగిన ఈ దుర్ఘటనలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎప్పటిలానే మార్నింగ్ వాక్‌కు వెళ్లిన వారిని వేగంగా వచ్చిన ఓ డీసీఎం వాహనం వెనుక నుంచి ఢీకొట్టడంతో ఈ విషాదం చోటుచేసుకుంది.

మాట్లాడదామని పిలిచి

మాజీ ప్రియురాలిని చంపి, కాల్చేసిన యువకుడు!



ఇంటర్నెట్ న్యూస్, (సామాన్యుడి అస్త్రం)

కేరళలోని ఇడుక్కి జిల్లాలో అత్యంత దారుణమైన సంఘటన చోటుచేసుకు ంది. ప్రేమ విఫలమై ందన్న కారణంతో ఓ యువకుడు తన మాజీ ప్రియురాలిని అత్యంత కిరాతకంగా హతమార్చాడు. గొంతు నులిమి, బండరాయితో కొట్టి చంపిన తర్వాత, సాక్ష్యాలు నాశనం చేసేందుకు మృతదేహానికి నిప్పు పె ట్టాడు. ఈ ఘాతుకానికి పాల్పడిన 19 ఏళ్ల నిశాంత్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

బంగ్లాదేశ్ తరహా హింసకు కుట్ర

- ఎన్నికల్లో గెలవలేకనే రాహుల్ గాంధీ దేశవ్యతిరేక శక్తులతో చేతులు కలిపారు
- రాజ్యాంగ పుస్తకం పట్టుకొని.. రాజ్యాంగబద్ధ సంస్థల నిర్వీర్యానికి కృషి
- ప్రశాంత్ భూషణ్, నేహా బోరా, అభిజీత్ దీప్కే విద్రోహ వ్యాఖ్యలపై కాంగ్రెస్ వైఖరి చెప్పాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్‌రావు

హైదరాబాద్, అక్టోబర్ 16 (సామాన్యుడి అస్త్రం)

బంగ్లాదేశ్ పరిణామాల నుంచి తాము ప్రేరణ పొంది, భారతదేశంలో కూడా అదే రీతిలో 'రెజీమ్ చేంజ్' (పాలన మార్పు) చేస్తామంటూ బాహాటంగా మాట్లాడిన మాటలపై కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్ తరహాలోనే దేశంలోనూ అరాచకాన్ని, హింసను సృష్టించడానికి దేశ విద్రోహులతో కలిసి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. గతంలో కశ్మీర్ సహా పలు జాతీయ అంశాలపై నిరంతరం దేశవ్యతిరేక వైఖరిని ప్ర



2

దర్శించిన న్యాయవాది ప్రశాంత్ భూషణ్, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ విద్యార్థి విభాగమైన ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియే షన్ (ఏఐఎస్ఏ) అధ్యక్షురాలు నేహా బోరా, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేత అభిజీత్ దీప్కే ఢిల్లీ ప్రెస్‌మీట్‌లో చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని, ముమ్మాటికీ దేశద్రోహపూరితమని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఓవైపు రాజ్యాంగ పుస్తకం చేతపట్టుకొని.. మరోదిక్కు రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నారని రాహుల్‌ను ఉద్దేశించి విమర్శించారు.

తెలంగాణకు హ్యుందాయ్

మొదటి పేజి తరువాయి

హ్యుందాయ్ ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన అనుమతులను వెంటనే జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఇదే క్రమంలో, తెలంగాణలో కార్ల తయారీ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేయాలని హ్యుందాయ్ ప్రతినిధులను ఆయన ఆహ్వానించారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అత్యంత అనుకూల వాతావరణం ఉందని, ప్రభుత్వ పరంగా అన్ని రకాల సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి వారికి హామీ ఇచ్చారు.ఈ భారీ పెట్టుబడితో జహీరాబాద్ ప్రాంతం ఆటోమొబైల్ హబ్‌గా మరింత అభివృద్ధి చెందనుండంటంతో పాటు, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు గణనీయంగా మెరుగుపడతాయని ప్రభుత్వం భావిస్తోంది.ఈ వార్త మీకు నచ్చిందా?..



నచ్చిన వార్తలను మీ మిత్రులతో కూడా పంచుకోండి. తెలంగాణకు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో 2024 ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశంలో తన నేతృత్వంలోని ప్రతినిధి బృందం హ్యుందాయ్ ప్రతినిధులతో చర్చలు జరిపిన విషయాన్ని ముఖ్యమంత్రి తెలిపారు. 2025 జూన్‌లో హ్యుందాయ్ ఆర్‌అండ్ డీ కేంద్రం ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం తెలిపింది.ప్రపంచ స్థాయి సౌకర్యాలతో భారీ శాటిలైట్ నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని హ్యుందాయ్ ప్రతినిధి బృందానికి సీఎం వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను తెలియజేస్తూ, రాబోయే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ హాజరుకావాలని సంస్థ యాజమాన్యాన్ని ఆహ్వానించారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ సాంకేతిక, అధునాతన ఇంజినీరింగ్ కేంద్రంగా మరింత బలోపేతం చేయాలన్న హ్యుందాయ్ లక్ష్యం తెలంగాణ రైజింగ్ -2047 విజన్‌కు తగ్గట్టు ఉందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ చాంగ్యూన్ చో తెలిపారు. తెలంగాణ అభివృద్ధి ప్రస్థానంలో తమ సంస్థ భాగస్వామిగా కొనసాగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో సీఎం సలహాదారు, ఎక్స్-ఆఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె. రామకృష్ణారావు, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విచారణకు సై

మొదటి పేజి తరువాయి

సింగరేణిలో తన బామ్మర్ది ప్రమేయంతో జరిగిందని తాము ఆరోపిస్తున్న రూ.10 వేల కోట్ల కుంభకోణంపైనా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో జరిగినట్లు తాము ఆరోపిస్తున్న సోలార్ పవర్ కుంభకోణాన్ని కూడా బయటపెడతామని పేర్కొన్నారు.గతంలో 70 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసిన సింగరేణిని బలహీనపరిచి, ఇప్పుడు ఆ సంస్థను పక్కనపెట్టి విదేశీ బొగ్గు కొనుగోళ్లకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపిం చారు. ఒకప్పుడు తెలంగాణలో 24 గంటల విద్యుత్ సరఫరాకు అండగా నిలిచిన సింగరేణినే ఇప్పుడు రేవంత్ రెడ్డి బదనాం చేస్తు న్నారని విమర్శించారు. సింగరేణిలో టన్ను బొగ్గు సుమారు రూ.3,800కు లభిస్తుంటే విదేశాల నుంచి కొనుగోలు చేస్తే టన్నుకు రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు ఖర్చవుతుందని పేర్కొన్నారు.ఆస్ట్రేలియా నుంచి బొగ్గు కొనుగోళ్ల పేరుతో కమీషన్లు పొందేందుకే ఈ వ్యవహారాన్ని ముందుకు తీసుకెళ్తు న్నారని ఆరోపించారు. దేశీయంగా సింగరేణిలో బొగ్గు అందుబాటులో ఉన్న దాన్ని ఉ పయోగించుకోకుండా కేవలం కమిషన్ల కోసం మాత్రమే విదేశీ బొగ్గు కోసం ప్రయ త్నం చేస్తున్నారన్నారు. సంక్షోభాన్ని ముందు గా సృష్టించి, పరిస్థితి చేయి దాటిన తర్వాత బొగ్గు తెస్తామని, విద్యుత్ కొనుగోలు చేస్తామని సీఎం చెబుతున్నారని విమర్శించారు.

రేవంత్‌రెడ్డి ఈఎంఐ సీఎం..రేవంత్ రెడ్డిని 'ఈఎంఐ ముఖ్యమంత్రి' అని, కాంగ్రెస్ అధిష్ఠానానికి రాజకీయ ఈఎంఐలు కట్టకపోతే సీఎం పదవి పోతుందనే భయంతోనే విదేశీ బొగ్గు కొనుగోళ్ల వ్యవహారంలో కమీషన్లు సమకూర్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్‌కు చెల్లించాల్సిన ఈఎంఐలను వసూలు చేసేందుకే ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రాష్ట్రంలో ఉన్నారని, రికవరీ ఏజెంట్‌ల వ్యవహరిస్తూ కమీషన్లు చెల్లించకపోతే రేవంత్ రెడ్డి పదవిని తొలగించే పరిస్థితి ఉంటుందని వ్యాఖ్యానించారు. సింగరేణి భుజంపై తుపాకీ పెట్టి టెండర్లు, కమీషన్ల లెక్కలు వేసుకుంటున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఒకప్పుడు 24 గంటల పాటు విద్యుత్ అందించిన తెలంగాణలో ఇప్పుడు కరెంట్ ఎందుకు లేదని కేటీఆర్ ప్రశ్నించారు.గతంలో ఛత్తీస్‌గఢ్‌లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంతో విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకున్నప్పుడు, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందాన్ని కూడా కుంభకోణంగా చిత్రీకరించారని గుర్తుచేశారు. అప్పట్లో యూనిట్ విద్యుత్‌ను రూ.3.90కు కొనుగోలు చేస్తే కుంభకోణమని ఆరోపించిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు యూనిట్‌కు రూ.15 చెల్లించి విద్యుత్ కొనుగోలు చేయాలని చూస్తోందని విమర్శించారు. గత విద్యుత్ కొనుగోళ్లపై కుంభకోణం పేరుతో కమిషన్ ఏర్పాటు చేసి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బదనాం చేసేందుకు కుట్ర చేశారని ఆరోపించారు.

బంగ్లాదేశ్ తరహా హింసకు కుట్ర

మొదటి పేజి తరువాయి

ప్రశాంత్ భూషణ్, ఐసా, సీజేపీ నేతల దేశద్రోహ వ్యాఖ్యలపై కాంగ్రెస్ వైఖరి ఏమిటో చెప్పాలన్నారు. శు క్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో రాంచందర్‌రావు మాట్లాడారు. దేశంలో రాజ్యాంగబద్ధంగా ఎన్నికలు జరగడం, ప్రజాతీర్పు మేరకు ఒక కూటమి గెలవడం, మరొకటి ఓడిపోవడం నిరంతర ప్రజాస్వామ్య ప్రక్రియ అన్నారు. బంగ్లాదేశ్ తరహా విధ్వంసాన్ని, హింసను ప్రేరణగా తీసుకుని భారతదేశంలోనూ పాలన మార్పు తెస్తా మంటూ విద్రోహ శక్తులు ప్రకటించడాన్ని కాంగ్రెస్ పార్టీ సమర్థిస్తుందా? అని ఆయన ప్రశ్నించారు.దేశవ్యాప్తంగా ఇలాంటి దేశవ్యతి రేక నినాదాలు, కుట్రలు జరుగుతుంటే కాంగ్రెస్ ఎందుకు మౌనం వహిస్తోందని నిలదీశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎప్పుడూ చేతిలో రాజ్యాంగ పుస్తకాన్ని పట్టుకుని తిరుగుతూ రాజ్యాంగ పరిరక్షణ గురించి ప్రసంగాలు చేస్తుంటారని,



కానీ రాజ్యాంగ విలువలనే కాలరాస్తున్న ఈ శక్తులపై ఎందుకు మాట్లాడటం లేదన్నారు. ఒకవైపు చేతిలో జాతీయ జెండా పట్టుకుని, మరోవైపు విదేశీ నిధుల అండతో దేశంలో అల్లర్లు, అరాచకం సృష్టించేందుకు కొందరు చేస్తున్న ప్రయత్నాలను దేశ ప్రజలంతా నిశితంగా గమనిస్తున్నారని ఆయన హెచ్చరించారు.దేశ ప్రజలకు అత్యంత నమ్మకమైన ప్రజాస్వామ్య వ్యవస్థలు, న్యాయవ్యవస్థ, కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) లాంటి సర్వోన్న త సంస్థలను నిర్వీర్యం చేసేందుకు రాహుల్ గాంధీ, అర్బన్ నక్సలైట్లు, 'టుకుడే- గ్యాంగ్ పక్కా వ్యూహంతో పనిచేస్తున్నాయని ఆరోపించారు. వీరి పోరాటం ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్ఎస్ఎస్ లేదా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌లకు వ్యతిరేకం కాదని, కేవలం అక్రమ మార్గాల్లో అధికారాన్ని చేజిక్కించుకోవడమే వీరి ఏకైక లక్ష్యమని చెప్పారు.ప్రజాస్వామ్య పద్ధతుల్లో జరిగే ఎన్నికల్లో రాహు ల్ ఎన్నటికీ గెలవలేరని స్పష్టమయ్యాక, దేశంలో అశాంతిని ప్రేరేపించి అధికారం దక్కించుకోవడా నికి కాంగ్రెస్ నేతలు దేశద్రోహ శక్తులతో చేతులు కలిపారని రాంచందర్‌రావు విమర్శించారు. స్వాతంత్ర్యం తెచ్చిన పార్టీగా చెప్పుకునే కాంగ్రెస్, నేడు నక్సలైట్ ఆలోచనా విధానా లకు దిగజారి దేశద్రోహుల పక్కన నిలబడటం సిగ్గుచేటన్నారు. ప్రశాంత్ భూషణ్, నేహా బోరా, దీప్కే తదితరుల విద్రోహ వ్యాఖ్యలపై కాంగ్రెస్ తన వైఖరిని వెంటనే స్పష్టం చేయాలని, లేనిపక్షంలో కాంగ్రెస్‌ను కూడా దేశం ఒక దేశద్రోహ పార్టీగానే పరిగణిస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు హెచ్చరించారు.

రేవంత్ సన్నిహితులకు మెడికవర్‌లో వాటాలు: మన్నె క్రిశాంక్

మొదటి పేజి తరువాయి

సీఎంకు సన్నిహితులంటూ ఆయన ముగ్గురి పేర్లను వెల్లడించారు. డుంపా శిరీష రెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, అన్నం శరత్ రెడ్డిలకు మెడికవర్ ఆసుపత్రి, మ్యాక్స్‌బిన్ ఫార్మా, మైండ్‌వాల్ట్ సంస్థల్లో ఉన్న షేర్ల వివరాలను సంఖ్యలతో సహా వెల్లడించారు. ఈ సంబంధాలు స్పష్టంగా కనిపిస్తున్నా ముఖ్యమంత్రి ఎందుకు మౌనంగా ఉన్నారని ఆయన ప్రశ్నించారు.మెడికవర్ ఆసుపత్రిని రూ.13,200 కోట్లకు విక్రయించారని, ఈ లావాదేవీ ద్వారా నల్లధనాన్ని తెల్లధనంగా మార్చారని క్రిశాంక్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారంపై తక్షణమే సీబీఐతో విచారణ జరిపించాలని, లేదంటే ఆ డబ్బును రాష్ట్రంలోని రైతులకు పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో ఇదే అంశంపై ఆరోపణలు చేసినందుకు మన్నె క్రిశాంక్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. తాజా వీడియోతో ఈ వివాదం మరోసారి రాజకీయంగా వేడెక్కింది.



కల్వకుంట్ల కుటుంబాన్ని గతంలో తిట్టి.. ఇప్పుడు పొగడ్తలా?

మొదటి పేజి తరువాయి

బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి పార్టీ మారినంత మాత్రాన... ఒకప్పుడు ఆయన తీవ్రంగా విమర్శించిన కల్వకుంట్ల కుటుంబం ఇప్పుడు మంచిదైపోయిందా? అని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సూటిగా ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి తీవ్రంగా స్పందించారు. ఈరోజు జగిత్యాల అర్బన్ కాలనీలో 33/11 కేవీ నూతన విద్యుత్ సబ్-స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం మంత్రి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు జీవన్ రెడ్డి... కేసీఆర్, కేటీఆర్‌తో పాటు కల్వకుంట్ల కుటుంబంపై తీవ్ర విమర్శలు చేశారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగిందని ఆరోపించిన జీవన్ రెడ్డి... ఇప్పుడు పార్టీ మారగానే వారంతా సత్యవంతులుగా కనిపిస్తున్నారా? అని నిలదీశారు.విద్యుత్ సమస్యలపై సాధారణ ఆరోపణలు చేయడం కాదని, నీళ్లు లేక ఎండిపోయిన ఒక్క పొలాన్నయినా చూపించాలని జీవన్ రెడ్డికి సవాల్



విసిరారు. ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ, జీవన్ రెడ్డిని కేబినెట్‌లోకి తీసుకుంటామని స్వయంగా ముఖ్యమంత్రే ప్రతిపాదించిన విషయాన్ని గుర్తు చేసుకోవాలని చెప్పారు.రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని, ఎల్ నినో ప్రభావంతో రైతులు నష్టపోకుండా ఉండేందుకు విద్యుత్ సరఫరాను రేవంత్ రెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

మార్నింగ్ వాక్‌లో విషాదం



మొదటి పేజి తరువాయి

తీవ్ర గాయాల పాలైన మరొకరికి ఆసుపత్రిలో చికిత్స
బలేంల గ్రామంలో అలముకున్న విషాద ఛాయలు
కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు

వివరాల్లోకి వెళితే.. బలేంల గ్రామానికి చెందిన గుర్రం సైదులు, ఆలకుంట నాగరాజు, గొల్ల జానయ్య ఈ ఉదయం నడక కోసం రోడ్డుపైకి వెళ్లారు. ఈ క్రమంలో జనగామ వైపు నుంచి సూర్యాపేట వైపు అతివేగంగా వెళ్తున్న డీసీఎం వాహనం వీరిని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద ధాటికి గుర్రం సైదులు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి, తీవ్రంగా గాయపడిన నాగరాజు, జానయ్యలను సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆలకుంట నాగరాజు మృతి చెందారు. ప్రమాదంలో ఆయన రెండు కాళ్లకు తీవ్ర గాయాలైనట్లు సమాచారం. తలకు బలమైన దెబ్బ తగిలిన గొల్ల జానయ్య ప్రస్తుతం అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్నారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు మృతి చెందడంతో బలేంల గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన డీసీఎం వాహనాన్ని గుర్తించేందుకు, పరారీలో ఉన్న డ్రైవర్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

సికింద్రాబాద్‌లో కేజేఆర్ గార్డెన్ కూల్చివేత



మొదటి పేజి తరువాయి

1996 నుంచి కొనసాగుతున్న న్యాయపోరాటానికి తెర
కోర్టు తీర్పుతో రంగంలోకి దిగిన కంటోన్మెంట్ బోర్డు
జేసీబీలతో నిర్మాణం నేలమట్టం

శుక్రవారం ఉదయం కంటోన్మెంట్ అధికారులు భారీ పోలీసు బందోబస్తు నడుమ యంత్రాలతో కేజేఆర్ గార్డెన్ వద్దకు చేరుకున్నారు. అనంతరం ఫంక్షన్ హాల్ నిర్మాణాన్ని కూల్చివేయడం ప్రారంభించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు రక్షణ చర్యలు చేపట్టారు. కొద్ది గంటల వ్యవధిలోనే ఆ నిర్మాణాన్ని అధికారులు పూర్తిగా నేలమట్టం చేశారు.సదరు స్థలంలో అక్రమ నిర్మాణంపై 1996 నుంచి న్యాయస్థానంలో వివాదం కొనసాగుతోంది. కేజేఆర్ గార్డెన్ యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా ఫంక్షన్ హాల్‌ను నిర్మించి, వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తోందని కంటోన్మెంట్ బోర్డు గతంలోనే స్పష్టం చేసింది. దీనిపై సుదీర్ఘకాలం పాటు సాగిన న్యాయపోరాటంలో ఇటీవలే న్యాయస్థానం కంటోన్మెంట్ బోర్డుకు అనుకూలంగా తీర్పు వెలువరించింది.కోర్టు ఆదేశాల మేరకు కంటోన్మెంట్ అధికారులు ఈ కూల్చివేత ప్రక్రియను పూర్తి చేశారు. దీంతో దాదాపు రెండు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్న వివాదానికి తెరపడినట్లయింది. అధికారులు ఈ చర్యతో కంటోన్మెంట్ ప్రాంతంలోని ఇతర అక్రమ నిర్మాణదారులకు గట్టి హెచ్చరికలు జారీ చేసినట్లయింది.

పిల్లల సోషల్ మీడియా భద్రత..

మొదటి పేజి తరువాయి

ఆన్‌లైన్ వేధింపులు, మానసిక ఆరోగ్యంపై పిటిషనర్ల ఆందోళన
తదుపరి విచారణను డిసెంబర్ 3వ తేదీకి వాయిదా వేసిన ధర్మాసనం

'ది ఎమరాల్డ్ హైట్స్ ఇంటర్నేషనల్ స్కూల్', దాని డైరెక్టర్ సిద్ధార్థ్ సింగ్ గిర్నార్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. సోషల్ మీడియా వాడకానికి కనీస వయసు నిబంధనలు, ఆన్‌లైన్ వేధింపుల నుంచి రక్షణ కల్పించే మార్గదర్శకాలు రూపొందించాలని వారు తమ పిటిషన్‌లో కోరారు. కేంద్ర ప్రభుత్వం, మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ, న్యాయ మంత్రిత్వ శాఖ, జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌ను ప్రతివాదులుగా చేర్చారు. ఇప్పటికే ఇలాంటి అంశంపై పెండింగ్‌లో ఉన్న మరో కేసుతో ఈ పిటిషన్‌ను ధర్మాసనం జతచేసింది. తదుపరి విచారణను డిసెంబర్ 3వ తేదీకి వాయిదా వేసింది.ప్రస్తుతం చాలా సోషల్ మీడియా సంస్థలు 13 ఏళ్ల కనీస వయసును స్వీయ-ధృవీకరణ పద్ధతిలో అమలు చేస్తున్నాయని, ఇది భారతీయ చట్టాల ప్రకారం పిల్లలకు లభించాల్సిన రక్షణకు సరిపోదని పిటిషనర్లు వాదించారు. 2023 నాటి డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ ప్రకారం 18 ఏళ్లలోపు ప్రతి ఒక్కరినీ 'పిల్లలు'గా పరిగణిస్తారని, వారికి అదనపు రక్షణ కల్పించాలని గుర్తుచేశారు.తల్లిదండ్రుల ధృవీకరణతో కూడిన అనుమతి, వారి ప్రవర్తనను ట్రాక్ చేయకుండా ఉండటం, లక్షిత ప్రకటనలపై పరిమితులు వంటివి ఇందులో ఉన్నాయని పేర్కొన్నారు. అయితే, ప్రస్తుతమున్న చట్టాలు అసంపూర్తిగా ఉన్నాయని, పిల్లల భద్రతకు సంబంధించి వయసు నిర్ధారణ, తల్లిదండ్రుల ప్రమేయం, సోషల్ మీడియా సంస్థల జవాబుదారీతనంపై స్పష్టమైన విధానం లేదని పిటిషన్‌లో ఆరోపించారు.సోషల్ మీడియా వల్ల పిల్లలు సైబర్‌బుల్లీయింగ్, వేధింపులు, హానికర కంటెంట్, అపరిచితుల నుంచి ప్రమాదకర పరిచయాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

రైతులను త్యాగాలు కోరడమా?

మొదటి పేజి తరువాయి

ఎల్ నినో ప్రభావం, రాష్ట్రంలో రాబోయే నీటి కొరతను ఎదుర్కోవడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విమర్శించారు. ప్రభుత్వానికి దూరదృష్టి కొరవడిందని ఆమె ఆరోపించారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.ఎల్ నినో ప్రభావంపై నిపుణులు ఏడాది ప్రారంభంలోనే హెచ్చరించినా ప్రభుత్వం పట్టించుకోలేదని, సకాలంలో నివారణ చర్యలు చేపట్టడంలో విఫలమైందని అన్నారు. పొరుగు రాష్ట్రాలు ఇప్పటికే కరవు మండలాలను ప్రకటించి కేంద్రానికి నివేదికలు సమర్పించాయని, కానీ తెలంగాణ ప్రభుత్వం ఇప్పుడు రైతులను త్యాగాలు చేయాలని కోరడం దారుణమని ఆమె విమర్శించారు.రాబోయే 10 నెలలు రాష్ట్రం తీవ్ర నీటి కొరతను ఎదుర్కోనుందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు.

సామాన్యుల శుభకార్యాలకు 'పటేల్ భవన్'..

ఘనంగా నూతన భవన ప్రారంభం!

- పెళ్లిళ్లు, శుభకార్యాలకు మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటులో ఫంక్షన్ హాల్
- మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో అన్ని సౌకర్యాలతో నూతన భవన నిర్మాణం
- మధ్యతరగతి కుటుంబాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక ఏర్పాట్లు
- ప్రారంభోత్సవ పూజల్లో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, పలువురు ప్రముఖులు



సామాన్యుడి అస్త్రం / హైదరాబాద్ :

పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాల నిర్వహణలో మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గించే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం ముందడుగు వేసింది. సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన మున్నూరు కాపు సంఘం పటేల్ భవన్‌ను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటులో ఉండేలా వివాహాలు, ఇతర వేడుకల నిర్వహణకు అవసరమైన సౌకర్యాలతో ఈ భవనాన్ని నిర్మించినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు.ప్రైవేటు ఫంక్షన్ హాళ్ల అద్దెలు సామాన్య కుటుంబాలకు భారంగా మారుతున్న నేపథ్యంలో అందుబాటు ధరల్లో వేడుకలు నిర్వహించుకునేందుకు పటేల్ భవన్ ఉపయోగపడుతుందని సంఘం సభ్యులు పేర్కొన్నారు. ఆడంబరాలకు పోకుండా కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో శుభకార్యాలు జరుపుకోవాలనుకునే వారికి ఈ భవనం అనుకూలంగా ఉంటుందని వివరించారు. సామాజిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇలాంటి భవనాలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు.నూతన భవన ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర హాజరై పూజల్లో పాల్గొన్నారు. నాగం స్వామి, నాగం మల్లికార్జున్, రౌతు కనకయ్య, మాధవరం నర్సింగ్ రావు, గాలి అనిల్, శేరిలింగంపల్లి సీనియర్ నాయకుడు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, టుడి ప్రవీణ్, సంపత్, సల్ల కృష్ణ, రేగుల రాజు, చందు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన భవన నిర్మాణాన్ని అభినందించిన నాయకులు, సామాన్య ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను సంఘం మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.

కర్ణాటక పరిశ్రమలకు తెలంగాణ ఆహ్వానం



రెండు రాష్ట్రాల మధ్య పారిశ్రామిక సహకారం విస్తరించాలి
డిసెంబర్ 7 నుంచి హైదరాబాద్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్
ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు
సదస్సుకు హాజరై అవకాశాలను పరిశీలించాలని పిలుపు

హైదరాబాద్, అక్టోబర్ 16 (సామాన్యుడి అస్త్రం)

తెలంగాణలో పెట్టుబడులకు ముందుకు రావాలని కర్ణాటక రాష్ట్రానికి చెందిన పారిశ్రామికవేత్తలు, పరిశ్రమల ప్రతినిధులకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు(ఆహ్వానం పలికారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలు పోటీపడే ప్రాంతాలు కావని, ఒకే విలువ ఆధారిత సరఫరా గొలుసులో భాగస్వాములని పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల మధ్య పారిశ్రామిక సహకారాన్ని మరింత విస్తరించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. శుక్రవారం బెంగళూరులో నిర్వహించిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ రోడ్‌షో'లో మంత్రి పాల్గొన్నారు. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వెల్లడించారు. హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి 9 వరకు ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు కర్ణాటక పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.తెలంగాణలో అందుబాటులో ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ఏరోస్పేస్, లైఫ్ సైన్సెస్, సెమీకండక్టర్లు, టెక్స్‌టైల్స్ వంటి రంగాల్లో తెలంగాణ, కర్ణాటక పరిశ్రమల మధ్య భాగస్వామ్యాలకు విస్తృత అవకాశాలున్నాయని తెలిపారు. ఇప్పటికే ఈ రంగాల్లో రెండు రాష్ట్రాలకు ప్రత్యేకమైన పారిశ్రామిక సామర్థ్యాలు ఉన్నాయని, పరస్పర సహకారంతో పెట్టుబడుల అవకాశాలను మరింత పెంచుకోవచ్చని పేర్కొన్నారు.పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణం కల్పించడం, పెట్టుబడులను ఆకర్షించడం, కొత్త ఉపాధి అవకాశాలను సృష్టించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యాల్లో భాగమని తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ ద్వారా అంతర్జాతీయ సంస్థలతోపాటు దేశీయ పారిశ్రామికవేత్తలను పెట్టుబడులకు ఆకర్షించడమే లక్ష్యమని వివరించారు. తెలంగాణను దీర్ఘకాలిక ఆర్థికాభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ విజన్‌ను రూపొందించిందని తెలిపారు. 2047 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మూడు లక్షల కోట్ల డాలర్ల స్థాయికి తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.ఈ లక్ష్యాల సాధనలో పారిశ్రామిక పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపే సంస్థలకు గ్లోబల్ సమ్మిట్ ఒక వేదికగా నిలుస్తుందని తెలిపారు. బెంగళూరు రోడ్‌షో ద్వారా కర్ణాటక పారిశ్రామిక వర్గాలకు తెలంగాణలోని పెట్టుబడి అవకాశాలను పరిచయం చేయడంతోపాటు, రెండు రాష్ట్రాల మధ్య పారిశ్రామిక సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. డిసెంబర్‌లో హైదరాబాద్‌లో జరగనున్న గ్లోబల్ సమ్మిట్‌లో ఈ భాగస్వామ్యాలు మరింత విస్తరించేలా చర్యలు చేపడుతోంది

వాహనదారులకు బిగ్ అప్‌డేట్

వాహనాల ఫిట్‌నెస్ చెకింగ్‌లో భారీ మార్పులు.. 37 ఆటోమేటెడ్ స్టేషన్లకు గ్రీన్ సిగ్నల్!

హైదరాబాద్, అక్టోబర్16

తెలంగాణలో వాహనాల ఫిట్‌నెస్ పరీక్షల విధానాన్ని ఆధునికీకరించేందుకు ప్రభుత్వం కీలక అడుగు వేసింది. వాహనాల సామర్థ్యం, రహదారి భద్రతకు సంబంధించిన పరీక్షలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 37 ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం మొత్తం రూ.425.50 కోట్లకు సవరించిన పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. రవాణా శాఖ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కార్యాలయం ఈ వివరాలను వెల్లడించింది.

ఒక్కో కేంద్రానికి రూ.11.50 కోట్లు

గతంలో 37 ఆటోమేటెడ్ కేంద్రాల ఏర్పాటుకు ఒక్కో కేంద్రానికి రూ.8 కోట్ల చొప్పున మొత్తం రూ.296 కోట్ల పరిపాలనా అనుమతులు ఇచ్చారు. తాజాగా సవరించిన ఉత్తర్వుల ప్రకారం ఒక్కో కేంద్రానికి అయ్యే అంచనా వ్యయాన్ని రూ.11.50 కోట్లకు పెంచారు. దీంతో ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.425.50 కోట్లకు చేరింది. ఈ ద్వారా వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలను ఆధునిక పరికరాలతో నిర్వహించే మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టును దశలవారీగా అమలు చేయనున్నారు. మొదటి దశలో ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం రూ.172.50 కోట్లను ఆమోదించింది. గతంలో ఉన్న జిల్లాల ప్రధాన కేంద్రాల్లో ఒక్కో ఆటోమేటెడ్ ఏర్పాటు చేయడంతో పాటు, గ్రేటర్ హైదరాబాద్, హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పరిధిలో అదనంగా నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రణాళిక రూపొందించారు.

వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలకు ఆధునిక సాంకేతికత

ప్రస్తుతం వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలకు సంబంధించిన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంలో ఆ కేంద్రాలు కీలక పాత్ర పోషించనున్నాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వాహనాలను పరీక్షించే వ్యవస్థను విస్తరించడం ఈ ప్రాజెక్టులో ప్రధాన ఉద్దేశం. ఈ కేంద్రాల ఏర్పాటు ద్వారా పరీక్షల నిర్వహణలో సాంకేతిక ప్రమాణాలను పెంచే అవకాశం ఉంది. 37 కేంద్రాల ఏర్పాటుకు సవరించిన అనుమతులు జారీ కాగా, తొలి విడతలో 15 కేంద్రాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. అయితే ప్రతి కేంద్రం నిర్మాణం పూర్తయ్యే తేదీలు, సేవలు ప్రారంభించే షెడ్యూల్, వాహనదారులకు వర్తించే ప్రత్యేక మార్పులపై స్పష్టమైన వివరాలు ఇంకా వెల్లడించాల్సి ఉంది. ఈ ప్రాజెక్టు అమలు పురోగతిని బట్టి తెలంగాణలో వాహనాల సేవలు మరింత ఆధునికంగా మారే అవకాశం ఉంది.

కాంగ్రెస్‌కు మద్దతివ్వండి



సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో పీసీసీ చీఫ్, మంత్రి పొన్నం, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 16(సామాన్యుడి అస్త్రం)

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని సీపీఎం పార్టీ నేతలను కాంగ్రెస్ పార్టీ కోరింది. సీపీఎం ఆఫీసులో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్(మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి తదితరులు శుక్రవారం సమావేశమయ్యారు. అనంతరం మహేష్‌కుమార్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రె స్ పార్టీ, ఇండీ కూటమి పార్టీలతో సహా సీపీఐ, సీపీఎం కలిసికట్టుగా సర్‌పై చేస్తున్న ఉద్యమం తీరుపై చర్చించామని తెలిపారు.రాష్ట్రంలోనూ సీపీఎం, సీపీఐ మద్దతుతో నడుస్తున్న తరుణంలో, వచ్చే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అభ్యర్థికి మద్దతు ఇవ్వవలసిందిగా కోరామన్నారు. వారు సానుకూలంగా స్పందించారని, పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారని ఆయన తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సన్నద్ధత సమావేశాన్ని శుక్రవారం నిర్వహించింది. ఈ సమావేశంలో ఏఐసీసీ ఇన్‌చార్జి సెక్రటరీ సచిన్ సావంత్, డీసీసీ అధ్యక్షులు మోత రోహిత్, దీపక్ జాన్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబెదుల్లా కొత్వాల్ , రాష్ట్ర గ్రంథాల సంస్థ చైర్మన్ రియాజ్, పక్ష్ బోర్డు చైర్మన్ అజ్మతుల్ల హుస్సేన్,15 నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు , పీసీసీ కోఆర్డినేటర్‌లు పాల్గొన్నారు.

రవీంద్రభారతిలో వేపకాయల బతుకమ్మ



హాజరైన ప్రముఖులు, మహిళలు, కళాకారులు

ముషీరాబాద్, అక్టోబర్ 16(సామాన్యుడి అస్త్రం)

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బతుకమ్మ సంబరాలు రవీంద్రభారతిలో శుక్రవారం ఏడో రోజు 'వేపకాయల బతుకమ్మ' పేరిట అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ(ప్రభుత్వ సలహాదారు వీ హనుమంతరావు(, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఆయన సతీమణి సుజన, మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, బీసీ సంఘం మహిళలు కలిసి రంగురంగుల బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఉత్సాహంగా ఆడిపాడారు.ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ విశిష్టతను, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల్లో ఈ పండుగకున్న విశిష్టమైన ప్రాధాన్యతను వివరించారు. వేపకాయల ఆకారంలో ముద్దలు చేసి నైవేద్యంగా సమర్పించే సంబరాల్లో వివిధ వర్గాల మహిళలు, ఉద్యోగులు, విద్యార్థులు, కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ సంచాల కులు ఏనుగు నరసింహా రెడ్డి (ఐఏఎస్)శాఖ సిబ్బంది, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

జనసేన 'గ్రాడ్యుయేట్ ఎక్స్ ప్రెస్' ప్రారంభించిన పవన్ కల్యాణ్

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం జనసేన ప్రచార రథం ప్రారంభం
'గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్'ను జెండా ఊపి ప్రారంభించిన పవన్ కల్యాణ్
అభ్యర్థి గడల శ్రీనివాసరావు గెలుపునకు పలు సూచనలు
యువత సమస్యలు తెలుసుకునే వేదికగా ఉండాలని పిలుపు

హైదరాబాద్, అక్టోబర్16(సామాన్యుడి అస్త్రం)

ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి జనసేన సిద్ధమైంది. ఈ ఎన్నికల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'జనసేన గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్' ప్రచార రథాన్ని పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ శుక్రవారం హైదరాబాదులో ప్రారంభించారు.ఈ సందర్భంగా వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ జనసేన అభ్యర్థిగా బరిలో ఉన్న డాక్టర్ గడల శ్రీనివాసరావుకు పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రచారానికి సంబంధించి ఆయనకు పలు సూచనలు చేశారు.ఈ 'గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్' కేవలం ఎన్నికల ప్రచార వాహనంగానే పరిమితం కాకూడదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

విజయవాడలో ఎన్టీఆర్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్..

విజయవాడలో ఎన్టీఆర్ ట్రస్ట్ రక్త నిధి కేంద్రం ఏర్పాటును అభినందించిన సీఎం చంద్రబాబు
సంస్థ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి బృందానికి ప్రత్యేక అభినందనలు
తలసేమియా చిన్నారులకు ఉచిత రక్తం అందించడం గొప్ప మానవీయ సేవ అని కొనియాడారు
విద్యా, వైద్య రంగాల్లో ట్రస్ట్ అందిస్తున్న సేవలను ప్రస్తావించిన ముఖ్యమంత్రి
ప్రాణ రక్షణే లక్ష్యంగా ట్రస్ట్ ముందుకు సాగాలని ఆకాంక్ష



అమరావతి,అక్టోబర్16(సామాన్యుడి అస్త్రం)

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలపై ప్రశంసల వర్షం కురిపించారు. విజయవాడలో కొత్తగా ఎన్టీఆర్ ట్రస్ట్ రక్త నిధి కేంద్రాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో, ఆయన ప్రత్యేకంగా అభినందించారు. రక్తం అందక ఏ ఒక్క ప్రాణమూ ప్రమాదంలో పడకూడదనే గొప్ప సంకల్పంతో ఈ కేంద్రాన్ని ప్రారంభించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా తన అర్ధాంగి, సంస్థ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి, ఆమె బృందానికి చంద్రబాబు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. "ఒక్కరి రక్తదానం ఆపదలో ఉన్న మరో కుటుంబానికి జీవన ప్రదాత అవుతుంది. ప్రాణాపాయంలో ఉన్నవారికి పునర్జన్మనిస్తుంది" అని చంద్రబాబు పేర్కొన్నారు. ముఖ్యంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ఉచితంగా రక్తం అందించాలనే నిర్ణయం గొప్ప మానవీయ సేవ అని ఆయన కొనియాడారు.కేవలం బ్లడ్ బ్యాంక్ మాత్రమే కాకుండా, విద్యా, వైద్యం, మహిళా సాధికారత వంటి ఎన్నో రంగాల్లో ఎన్టీఆర్ ట్రస్ట్ అందిస్తున్న సేవలను చంద్రబాబు గుర్తుచేశారు. 'సంజీవని మొబైల్ క్లినిక్స్' ద్వారా మారుమూల గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు వైద్య సేవలు చేరవేయడం స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు.ప్రతి సేవలో మానవత్వం, ప్రతి ప్రయత్నంలో ప్రాణ రక్షణే లక్ష్యంగా ఎన్టీఆర్ ట్రస్ట్ తన సేవలను మరింతగా విస్తరించి, ఎంతో మందికి అండగా నిలవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

ఏపీలో పలు జిల్లాలకు వర్ష సూచన



రాష్ట్రంలో రానున్న నాలుగు రోజులు వర్షాలు కురిసే అవకాశం
పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు
కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు పడతాయని అంచనా
ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచన

అమరావతి,అక్టోబర్16

ఆంధ్రప్రదేశ్‌లో రానున్న నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా ప్రకారం.. విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.అదేవిధంగా శ్రీకాకుళం, పోలవరం, విశాఖపట్నం, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, నంద్యాల, శ్రీ సత్యసాయి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీఎస్‌డీఎంఏ తెలిపింది.వర్షాల నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తున్న సమయంలో చెట్ల కింద లేదా బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని హెచ్చరించారు. సురక్షితమైన భవనాల్లో ఆశ్రయం పొందాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

నామినేషన్ల వేళ పుంగనూరులో టెన్షన్..

వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య రాళ్ల దాడి



అన్నమయ్య జిల్లా పుంగనూరులో వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ
నామినేషన్ల ప్రక్రియలో ఇరువర్గాలు రాళ్లు, కర్రలతో దాడులు
ఎంపీ మిథున్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని దాడి జరిగిందన్న వైసీపీ
పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని అధికార పార్టీపై విపక్షం ఆరోపణ

అమరావతి,అక్టోబర్16

అన్నమయ్య జిల్లా పుంగనూరు, రాయచోటిలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల తొలి రోజైన శుక్రవారం వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ చెలరేగింది. ఇరువర్గాలు పరస్పరం రాళ్లతో దాడులు చేసుకోవడంతో వాతావరణం ఉద్రిక్తంగా మారింది. అటు రాయచోటిలో వాహనాలకు నిప్పంటించారు. వివరాల్లోకి వెళితే.. వైసీపీ లోక్‌సభా పక్ష నేత, రాజంపేట ఎంపీ పీవీ మిథున్ రెడ్డి పార్టీ అభ్యర్థులతో కలిసి నామినేషన్లు దాఖలు చేసేందుకు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. టీడీపీ కార్యకర్తలు తమ కాన్వాయ్‌ను అడ్డుకుని, నామినేషన్ కేంద్రానికి వెళ్లకుండా నిరోధించే ప్రయత్నం చేశారని వైసీపీ ఆరోపించింది. కర్రలు, ఇనుప రాడ్లతో వాహనాలపై దాడి చేశారని, ఈ ఘటనలో పలు వాహనాలు ధ్వంసమయ్యాయని తెలిపింది. ఈ ఘర్షణలో కొందరికి గాయాలయ్యాయి.ఈ దాడి తనపై జరిగిన హత్యాయత్నమని వైసీపీ తీవ్రంగా ఖండించింది. ఎన్నికల ప్రక్రియను హింసతో అడ్డుకునేందుకు టీడీపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించింది. ఘటన జరిగినప్పుడు అక్కడే ఉన్న పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని, తమ అభ్యర్థులకు రక్షణ కల్పించడంలో విఫలమయ్యారని విమర్శించింది. ఈ ఘటనపై రాష్ట్ర ఎన్నికల సంఘం వెంటనే స్పందించాలని డిమాండ్ చేసింది. బాధ్యులపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని, అభ్యర్థులకు భద్రత కల్పించి ప్రశాంతంగా నామినేషన్లు వేసేలా చూడాలని కోరింది. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈ ప్రాంతంలో నెలకొన్న రాజకీయ వైరం ఈ ఘర్షణతో మరోసారి బయటపడింది.



ఇంద్రకీలాద్రికి భక్తజన సంద్రం..




మూలా నక్షత్రం సందర్భంగా ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు
సరస్వతీ దేవి అలంకారంలో దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ
రద్దీ కారణంగా అన్ని వీఐపీ, సిఫార్సు దర్శనాలు రద్దు
సాయంత్రం అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు
భక్తుల కోసం ఐదంచెల భద్రతతో పటిష్ఠ ఏర్పాట్లు

అమరావతి,అక్టోబర్16(సామాన్యుడి అస్త్రం)

విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజైన శుక్రవారం, అమ్మవారి జన్మనక్షత్రమైన 'మూలా నక్షత్రం' కావడంతో కనకదుర్గమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఈ పవిత్రమైన రోజున అమ్మవారు జ్ఞాన ప్రదాయిని అయిన శ్రీ సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. తెల్లవారుజాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో ఇంద్రకీలాద్రి పరిసరాలు జనసంద్రంగా మారాయి.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అధికారులు వీఐపీ బ్రేక్ దర్శనాలతో పాటు అన్ని రకాల సిఫార్సు దర్శనాలను పూర్తిగా రద్దు చేశారు. మూలా నక్షత్రం సందర్భంగా క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులందరికీ కేవలం ఉచిత దర్శనం మాత్రమే కల్పిస్తున్నారు. రద్దీని నియంత్రించేందుకు పోలీసులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. మూడు చోట్ల హోల్డింగ్ పాయింట్లను ఏర్పాటు చేసి, ఐదంచెల భద్రత నడుమ భక్తులను క్రమపద్ధతిలో క్యూలైన్లలోకి అనుమతిస్తున్నారు. జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ ఎప్పటికప్పుడు సాంకేతికత సాయంతో ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ సిబ్బందికి తగిన సూచనలు జారీ చేస్తున్నారు.నేటి సాయంత్రం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. అశ్వయుజ శుద్ధ సప్తమి, మూలా నక్షత్రం రోజున అమ్మవారిని సరస్వతీ దేవి రూపంలో పూజించడం వల్ల విద్య, జ్ఞానం, బుద్ధికుశలత సిద్ధిస్తాయని పండితులు చెబుతున్నారు. మరోవైపు, శ్రీశైల మహాక్షేత్రంలో భ్రమరాంబికా దేవి ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజున కాత్యాయని అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు.

సాయికృష్ణ కేసులో కీలక పరిణామం.. ఏపీ హైకోర్టు కీలక ఉత్తర్వులు



గాదె సాయికృష్ణ కస్టోడియల్ టార్చర్ కేసు సీబీఐకి బదిలీ
విచారణను సీబీఐకి అప్పగిస్తూ ఏపీ హైకోర్టు ఉత్తర్వులు
బాధితుడి తల్లికి రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశం
రాష్ట్ర పోలీసుల విచారణపై అనుమానాలు వ్యక్తం చేసిన న్యాయస్థానం
పోలీసులే మృతదేహాన్ని మాయం చేశారన్న ఆరోపణల నేపథ్యంలో తీర్పు

అమరావతి,అక్టోబర్16(సామాన్యుడి అస్త్రం)

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ కస్టోడియల్ టార్చర్ కేసులో ఏపీ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసు దర్యాప్తును కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కి బదిలీ చేస్తూ నేడు ఉత్తర్వులు జారీ చేసింది. అంతేగాక బాధితుడి తల్లికి నాలుగు వారాల్లోగా రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.వివరాల్లోకి వెళితే.. కొన్ని నాన్-బెయిలబుల్ వారెంట్ల కేసులో 25 ఏళ్ల సాయికృష్ణను 2026 మే నెలలో మార్కాపురం సమీపంలో టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విజయవాడలోని కృష్ణలంక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే, అతడిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచకపోగా, ఆ తర్వాత అతని ఆచూకీ గల్లంతైంది. దీంతో సాయికృష్ణ తల్లి గాదె విజయలక్ష్మి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు.ఈ కేసుపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ జరిపి, మే 6 నుంచి 8 మధ్య కస్టడీలో జరిగిన చిత్రహింసల వల్లే సాయికృష్ణ మరణించినట్లు నిర్ధారించింది. అక్రమ నిర్బంధం, సీసీటీవీ ఫుటేజ్ డిలీట్ చేయడం, మృతదేహాన్ని రహస్యంగా మాయం చేయడం వంటి ఆరోపణలతో అప్పటి సీఐతో సహా పలువురు పోలీసు సిబ్బందిని అరెస్ట్ చేసి, చార్జిషీట్ కూడా దాఖలు చేశారు.అయితే, రాష్ట్ర పోలీసుల విచారణ నిష్పక్షపాతంగా జరగడం లేదని, కేసును సీబీఐకి అప్పగించాలని సాయికృష్ణ తల్లితో పాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్లు వేశారు. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం, సమగ్ర దర్యాప్తు అవసరమని భావించి కేసును సీబీఐకి బదిలీ చేస్తున్నట్లు స్పష్టం చేసింది. గతంలో సుప్రీంకోర్టు కూడా ఈ కేసు విచారణను పర్యవేక్షిస్తూ, ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యం, సాక్ష్యాలు మాయం కావడంపై ప్రశ్నలు లేవనెత్తడం గమనార్హం.

పుంగనూరు ఘర్షణలపై ఎస్పీ ధీరజ్ ప్రెస్ మీట్..



పుంగనూరు నామినేషన్ల ప్రక్రియలో తీవ్ర ఉద్రిక్తత
వైసీపీ వర్సెస్ టీడీపీ
గేట్లు, బారికేడ్లను ఢీకొట్టి లోపలికి ప్రవేశించిన వాహనాలు
అతివేగంగా వచ్చిన వాహనం ఢీకొని పలువురికి గాయాలు
చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలన్న అన్నమయ్య జిల్లా ఎస్పీ

అమరావతి,అక్టోబర్16(సామాన్యుడి అస్త్రం)

పుంగనూరులో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ తీవ్ర ఉద్రిక్తతల మధ్య ప్రారంభమైంది. వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి తన అనుచరులతో కలిసి నామినేషన్ కేంద్రానికి రావడం ఘర్షణకు దారితీయడం తెలిసిందే. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి వైసీపీ శ్రేణులు వ్యవహరించాయని, ఈ క్రమంలో జరిగిన ఘర్షణలో పలువురు గాయపడ్డారని అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ తెలిపారు. దీనిపై ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. జరిగిన ఘటనను వివరించారు.

ఎస్పీ ప్రెస్ మీట్ వివరాలు..

"పుంగనూరు మున్సిపాలిటీలో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియలో ఈరోజు నామినేషన్లు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో వైసీపీకి చెందిన ఎంపీ మిథున్ రెడ్డి, ఆయన అనుచరులు, అభ్యర్థులు సుమారు 100 మంది తమ నివాసం నుంచి ఆరు వాహనాల్లో నామినేషన్ కేంద్రానికి బయలుదేరారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం, నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలోకి అభ్యర్థి, మరో ఇద్దరు మాత్రమే రావాలి. కానీ, దాన్ని ఉల్లంఘించి, వాహనాలతో అతివేగంగా అక్కడ ఉన్న స్టాపర్లను, గేటును ఢీకొట్టుకుని లోపలికి వచ్చారు. దీన్ని అక్కడ ఉన్న టీడీపీ అభ్యర్థులు, కార్యకర్తలు తీవ్రంగా వ్యతిరేకించడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. వెంటనే మా పోలీస్ సిబ్బంది జోక్యం చేసుకుని ఇరు వర్గాలను చెదరగొట్టారు. అదే సమయంలో, ఒక వాహనం నామినేషన్ కేంద్రంలోకి అతివేగంగా, అజాగ్రత్తగా దూసుకువచ్చి అక్కడి జనం మీదకు వెళ్ళింది. ఈ ఘటనలో కొందరికి గాయాలయ్యాయి. వారిని వెంటనే అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించాం. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు మా బలగాలన్నింటినీ అక్కడికి తరలించి, గుంపును చెదరగొట్టాం. ఎంపీ గారిని ఒక గదిలో ఉంచాం. బయట గుంపు మొత్తం చెదిరిపోయిన తర్వాత, ఎంపీని సురక్షిత ప్రాంతానికి పంపించాం. ఈ సంఘటనలో ఎవరైతే చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవాలని ప్రయత్నించారో, వారిని కఠినంగా శిక్షిస్తామని మా పోలీసు శాఖ తరఫున తెలియజేస్తున్నాను. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలి. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నాం" అని ఎస్పీ స్పష్టం చేశారు. మరోవైపు, ఈ ఘటనపై రాష్ట్ర మంత్రి డీఎస్‌బీవీ స్వామి కూడా తీవ్రంగా స్పందించారు. వైసీపీ శ్రేణుల తీరును ఖండిస్తున్నామని అన్నారు. పుంగనూరులో రౌడీయిజం చేస్తే చూస్తూ ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు. ఈ సంఘటనతో పుంగనూరులో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

సత్యసాయి జిల్లాలో విషాద ఘటన.. నీట మునిగి ఐదుగురు మహిళలు మృతి.. లోకేశ్ దిగ్భ్రాంతి

శ్రీ సత్యసాయి జిల్లాలో దుర్ఘటన
గొల్లపల్లి జలాశయంలో మునిగి ఐదుగురు మహిళలు మృతి
విహారయాత్రకు వెళ్లి సరదాగా ఈతకు దిగడంతో ఘటన
మృతుల కుటుంబాలకు మంత్రి నారా లోకేశ్ ప్రగాఢ సానుభూతి
బాధిత కుటుంబాలను ఆదుకుంటామని ప్రభుత్వ హామీ

అమరావతి,అక్టోబర్16(సామాన్యుడి అస్త్రం)

శ్రీ సత్యసాయి జిల్లాలో తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. పెనుకొండ సమీపంలోని గొల్లపల్లి జలాశయంలో ఈతకు వెళ్లి ఐదుగురు మహిళలు నీట మునిగి మృతి చెందారు. విహారయాత్ర కోసం వెళ్లిన వీరి జీవితాల్లో ఈ సంఘటన అంతులేని విషాదాన్ని నింపింది. వివరాల్లోకి వెళితే, పెనుకొండ పట్టణంలోని దర్గాపేటకు చెందిన కొందరు మహిళలు శుక్రవారం విహారయాత్ర కోసం గొల్లపల్లి జలాశయానికి వెళ్లారు. వీరిలో ఐదుగురు సరదాగా ఈత కొట్టేందుకు నీటిలోకి దిగారు. అయితే, నీటి లోతు ఎక్కువగా ఉండటంతో ఊహించని విధంగా మునిగిపోయారు. సమీపంలో ఉన్నవారు వారిని కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను వెలికితీసి, పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతులను మహీం, హసీనా, పుష్పలత, గాయత్రమ్మ, అశ్వినిగా గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం: మంత్రి లోకేశ్

ఈ దురదృష్టకర సంఘటనపై ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "శ్రీ సత్యసాయి జిల్లా గొల్లపల్లి జలాశయం వద్దకు విహారయాత్రకు వెళ్లి ఐదుగురు మహిళలు మృత్యువాత పడటం చాలా బాధాకరం. మృతులకు నివాళులర్పిస్తున్నాను. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుంది"

రాయలసీమలో ఎన్నికల ఉద్రిక్తతలు..
ఈసీకి ఫిర్యాదు చేసిన టీడీపీ



స్థానిక ఎన్నికల నామినేషన్ల వేళ
రాయలసీమలో ఘర్షణలు
వైసీపీ నేతలు దౌర్జన్యాలకు పాల్పడ్డారంటూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి టీడీపీ ఫిర్యాదు
పుంగనూరులో ఎంపీ మిథున్‌రెడ్డి దాడులకు పాల్పడ్డారని ఆరోపణ
ఘటనలకు సంబంధించిన వీడియో ఆధారాలను ఈసీకి సమర్పించిన నేతలు
అధికారులను భయపెడుతున్నారని పెద్దిరెడ్డి కుటుంబంపై ఫిర్యాదు

అమరావతి,అక్టోబర్16(సామాన్యుడి అస్త్రం)

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ రాయలసీమలో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. పలు ప్రాంతాల్లో వైసీపీ నేతలు, కార్యకర్తలు దాడులకు పాల్పడుతూ, ప్రతిపక్షాలను నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ టీడీపీ రాష్ట్ర ఎన్నికల సంఘానికి (ఎస్ఈసీ) ఫిర్యాదు చేసింది. ఈ మేరకు టీడీపీ సీనియర్ నేతలు వర్ల రామయ్య, అశోక్‌బాబు తదితరులు శుక్రవారం ఎస్ఈసీ కార్యాలయానికి వెళ్లి ఎన్నికల కమిషనర్‌ను కలిశారు. రాయలసీమలోని పుంగనూరు, రాయచోటి, ధర్మవరం, తిరుపతి నియోజకవర్గాల్లో వైసీపీ విధ్వంసం సృష్టించిందంటూ వారు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా అన్నమయ్య జిల్లా పుంగనూరులో వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి స్వయంగా దాడులకు పాల్పడ్డారని వారు తీవ్ర ఆరోపణలు చేశారు. పుంగనూరు మున్సిపల్ ఎన్నికల నామినేషన్ కేంద్రం వద్ద ఎంపీ మిథున్‌రెడ్డి, ఆయన అనుచరులు టీడీపీ కార్యకర్తలు, ప్రజలపైకి కాన్వాయ్‌తో దూసుకెళ్లి భయానక వాతావరణం సృష్టించారని వర్ల రామయ్య ఆరోపించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో దృశ్యాలను వారు ఎన్నికల సంఘానికి ఆధారాలుగా సమర్పించారు. పెద్దిరెడ్డి కుటుంబం అధికారులను భయభ్రాంతులకు గురి చేస్తూ ప్రజాస్వామ్య ప్రక్రియను అపహాస్యం చేస్తోందని టీడీపీ నేతలు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. వైసీపీ నేతల దౌర్జన్యాలపై తక్షణమే విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని వారు ఎన్నికల సంఘాన్ని కోరారు. ఈ ఫిర్యాదుతో రాయలసీమలో స్థానిక ఎన్నికల రాజకీయాలు మరింత వేడెక్కాయి.

ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు పట్టువస్త్రాలు
సమర్పించిన సీఎం చంద్రబాబు



విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్న సీఎం చంద్రబాబు దంపతులు
ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు, సారె సమర్పణ
ముఖ్యమంత్రికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన అధికారులు
దర్శనానంతరం పండితుల వేదాశీర్వచనం
దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు

అమరావతి,అక్టోబర్16

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన అర్ధాంగి నారా భువనేశ్వరి శుక్రవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు, సారెను వారు సమర్పించారు. ఇంద్రకీలాద్రికి చేరుకున్న ముఖ్యమంత్రి దంపతులకు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, ఆలయ కార్యనిర్వహణాధికారి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో వారిని అమ్మవారి దర్శనానికి తీసుకువెళ్లారు. గర్భాలయంలో చంద్రబాబు దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి పట్టువస్త్రాలను, ఆయన అర్ధాంగి సారెను అమ్మవారికి సమర్పించారు. దర్శనం ముగిసిన అనంతరం, ఆలయ పండితులు ముఖ్యమంత్రి దంపతులకు వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం వారికి అమ్మవారి తీర్థప్రసాదాలను, జ్ఞాపికను అందజేశారు. దసరా నవరాత్రుల సందర్భంగా ముఖ్యమంత్రి స్వయంగా అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాయచోటిలో వేడెక్కిన రాజకీయం..
శ్రీకాంత్‌రెడ్డికి సవాల్ విసిరిన మంత్రి మండిపల్లి




రాయచోటి అభివృద్ధిపై చర్చకు రావాలని శ్రీకాంత్‌రెడ్డికి మండిపల్లి సవాల్
రూ.450 కోట్లతో జల్ జీవన్ మిషన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని వెల్లడి
కార్యకర్తలను రెచ్చగొట్టి ఉద్రిక్తతలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణ

అమరావతి,అక్టోబర్16(సామాన్యుడి అస్త్రం)

రాయచోటి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సవాల్ విసిరారు. నేను చేసిన పనులు నేరుగా ప్రజల ముందే చూపిస్తా.. గతంలో నువ్వు చేసిన పనులేంటో చూపించే దమ్ముందా? అని ఆయన ప్రశ్నించారు. రాయచోటిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, గత ప్రభుత్వ తీరును ఎండగడుతూ, తమ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను గణాంకాలతో సహా వివరించారుగత 25 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. రూ.450 కోట్లతో జల్ జీవన్ మిషన్ కింద ఆరు మండలాలకు తాగునీటి ప్రాజెక్టు, రూ.420 కోట్ల అంచనాతో 25 వేల ఎకరాలకు సాగునీరందించే శ్రీనివాసపురం రిజర్వాయర్ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అమృత్ పథకం నిధులను వెనక్కి పంపించిందని ఆయన విమర్శించారు. ఎన్నికలు రాగానే శ్రీకాంత్‌రెడ్డి కార్యకర్తల పేరుతో చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. వైసీపీ శ్రేణులను రెచ్చగొట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. "అధికారం కోల్పోయాక రాయచోటి మొహం చూడని వ్యక్తి ఇప్పుడు నీతులు చెబుతున్నారు. నీకు దమ్ముంటే రానున్న 40 రోజులు ఇక్కడే ఉండి కార్యకర్తలకు అండగా నిలబడు" అని సవాల్ చేశారు. తాను 22 ఏళ్లుగా ప్రజల్లో ఉంటూ కష్టపడి ఈ స్థాయికి వచ్చానని, ఎవరి కాళ్లూ పట్టుకోలేదని రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.

రోజుకు రూ. 200 కోట్ల నష్టం.. కన్నాట్ ప్లేస్ బంద్‌పై వ్యాపారుల ఆవేదన



సీజేపీ 'తిరంగా మార్చ్' నేపథ్యంలో ఢిల్లీ కన్నాట్ ప్లేస్ మూసివేత

రోజుకు రూ.200 కోట్ల నష్టం వాటిల్లుతోందని వ్యాపారుల ఆందోళన

అత్యవసర విచారణకు సుప్రీంకోర్టు నిరాకరణ, కానీ కీలక వ్యాఖ్యలు

అందరిలో మంచి ఆలోచన రావాలని ఆశిస్తున్నామన్న సుప్రీం ధర్మాసనం

చట్టవిరుద్ధంగా నష్టం జరిగితే పరిహారం ఇప్పించే అధికారం ఉందని వ్యాఖ్య

న్యూఢిల్లీ, అక్టోబర్16,(సామాన్యుడి అస్త్రం)

'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ప్రతిపాదించిన 'లెట్రో దో తిరంగా' నిరసన కార్యక్రమం కారణంగా ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో సెంట్రల్ పార్క్‌ను మూసివేయడాన్ని వ్యతిరేకిస్తూ వ్యాపారులు దాఖలు చేసిన పిటిషన్‌పై తక్షణ విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అయితే, ఈ మూసివేత వల్ల చిన్న వ్యాపారులపై పడే ప్రభావం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ పరిణామంతో తమకు రోజుకు సుమారు రూ. 200 కోట్ల నష్టం వాటిల్లుతోందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఢిల్లీ కిరాణా కమిటీ, ఢిల్లీ ఐరన్ అండ్ హార్డ్‌వేర్ మర్చంట్ అసోసియేషన్ ఈ మేరకు పిటిషన్ దాఖలు చేశాయి. పిటిషనర్ల తరఫున న్యాయవాది జై అనంత్ దేహాద్రాయ్.. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ముందు నేడు వాదనలు వినిపించారు. న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ (ఎన్‌డీఎంసీ) అర్ధరాత్రి వేళ పార్క్‌ను మూసివేయాలని ఆదేశాలు జారీ చేసిందని, పండగ సీజన్‌లో ఈ నిర్ణయం వల్ల వ్యాపార కార్యకలాపాలు స్తంభించిపోయి, తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆయన కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.దీనిపై స్పందించిన సీజేఐ సూర్యకాంత్.. "ఈ విషయంలో సంబంధిత వర్గాలన్నింటిలోనూ మంచి ఆలోచన వస్తుందని మేము ఆశిస్తున్నాము. పండగ రోజుల్లో చిన్న దుకాణదారులు తమ జీవనోపాధిని ఎలా సంపాదించుకుంటారో మాకు తెలుసు. వారి కుటుంబాలు ఎదుర్కొనే కష్టాలు, ఇబ్బందులు మాకు అర్థమవుతాయి" అని వ్యాఖ్యానించారు.ఇదే సమయంలో జస్టిస్ బాగ్చీ జోక్యం చేసుకుంటూ.. నిరసన తెలిపే హక్కు, శాంతిభద్రతల పరిరక్షణ, వ్యాపారం చేసుకునే హక్కు పరస్పరం ముడిపడి ఉంటాయని అన్నారు. ఒకవేళ ప్రభుత్వం విధించిన ఆంక్షలు అహేతుకమైనవని, వాటి వల్ల వ్యాపారులకు చట్టవిరుద్ధంగా నష్టం వాటిల్లిందని తర్వాత తేలితే, రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక అధికారాలను ఉపయోగించి కోర్టు నష్టపరిహారం ఇప్పించవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఈ అంశంపై ఇప్పటికే ఢిల్లీ హైకోర్టులో సంబంధిత పిటిషన్లు విచారణలో ఉన్నాయి. దసరా సెలవుల అనంతరం, అక్టోబర్ 26 లేదా 27 తేదీల్లో ఈ పిటిషన్‌పై విచారణ జరిపే అవకాశం ఉంది.

బంగారం, వెండి ఎగుమతులపై కేంద్రం కీలక నిర్ణయం



బంగారం, వెండి ఆభరణాల ఎగుమతులపై 'డ్యూటీ డ్రాబ్యాక్' రేట్లు తగ్గింపు

ఎగుమతిదారుల లాభాలపై ప్రభావం చూపే అవకాశం

బంగారంపై 3.1%, వెండిపై 9% మేర తగ్గిన రిఫండ్

జులైలో ఈ రేట్లను భారీగా పెంచిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ, అక్టోబర్16,(సామాన్యుడి అస్త్రం)

ప్రపంచ మార్కెట్లో డిమాండ్ బాగుంటే ప్రభావం తక్కువేనన్న నిపుణులు

బంగారం, వెండి ఆభరణాలతో పాటు ఇతర విలువైన లోహ ఉత్పత్తుల ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం 'డ్యూటీ డ్రాబ్యాక్' రేట్లను తగ్గిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఈ రోజు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నిర్ణయంతో నగల ఎగుమతిదారుల లాభాలపై కొంత ప్రభావం పడే అవకాశం ఉంది.తాజా సవరణ ప్రకారం.. బంగారం ఆభరణాల ఎగుమతిపై డ్యూటీ డ్రాబ్యాక్ గ్రాముకు రూ. 1,851.99 నుంచి రూ. 1,794.11కి తగ్గింది. ఇది సుమారు 3.1 శాతం కోత. ఇక వెండి ఉత్పత్తుల విషయంలో ఈ తగ్గింపు మరింత ఎక్కువగా ఉంది. వెండి ఆభరణాలు, ఇతర వస్తువుల ఎగుమతిపై కిలోగ్రాముకు రూ. 29,501.09గా ఉన్న రేటును రూ. 26,859.02కి తగ్గించారు. ఇది దాదాపు 9 శాతం తగ్గింపును సూచిస్తోంది.ఎగుమతి చేసే వస్తువుల తయారీకి ఉపయోగించే ముడిసరుకులపై చెల్లించిన కస్టమ్స్, ఇతర సుంకాలను ఎగుమతిదారులకు తిరిగి చెల్లించే విధానాన్నే 'డ్యూటీ డ్రాబ్యాక్' అంటారు. అంతర్జాతీయ మార్కెట్లో భారత ఉత్పత్తుల పోటీతత్వాన్ని పెంచడం దీని ముఖ్య ఉద్దేశం.అయితే, ఈ ఏడాది జులైలో ప్రభుత్వం నగల ఎగుమతి రంగానికి ఊరటనిస్తూ డ్యూటీ డ్రాబ్యాక్ రేట్లను భారీగా పెంచింది. అప్పట్లో బంగారం ఆభరణాలపై రిఫండ్‌ను గ్రాముకు రూ. 773.17 నుంచి రూ. 1,851.99కి, వెండిపై కిలోకు రూ. 14,990.66 నుంచి రూ. 29,501.09కి పెంచింది. ప్రస్తుత రేట్ల తగ్గింపు నేపథ్యంలో ప్రపంచ మార్కెట్లో డిమాండ్ బలంగా కొనసాగితే ఎగుమతులపై పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

ఈ నెలలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు..

ఈ నెలలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించే అవకాశం

మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై కేంద్రం దృష్టి

ఏప్రిల్ 17న లోక్‌సభలో వీగిపోయిన రాజ్యాంగ సవరణ బిల్లు

బిల్లుల ఆమోదానికి పార్లమెంట్‌లో ప్రత్యేక మెజారిటీ తప్పనిసరి

డీఎంకే సహా పలు పార్టీల మద్దతు కోసం కేంద్రం ప్రయత్నాలు

న్యూఢిల్లీ, అక్టోబర్16,(సామాన్యుడి అస్త్రం)

మహిళా రిజర్వేషన్లు, లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లులను ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ నెలలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. లోక్‌సభలో ఈ బిల్లులను ఆమోదింపజేసేందుకు అవసరమైన మద్దతు తమకు ఉందని కేంద్రం ధీమాగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అంశాలపై ప్రతిపక్షాల నిరసనలు కొనసాగుతున్నాయి.ప్రతిపాదిత బిల్లులకు మద్దతు కూడగట్టేందుకు కేంద్రం ప్రతిపక్ష పార్టీలతోనూ చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఈ ఏడాది ఏప్రిల్ 17న బడ్జెట్ సమావేశాల సందర్భంగా నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయింది. దీంతో ఈసారి బిల్లులను ఆమోదింపజేసుకోవడం కేంద్రానికి కీలకంగా మారింది.



రెండు వంతుల మెజారిటీ అవసరం

రాజ్యాంగ సవరణ బిల్లుల ఆమోదానికి పార్లమెంట్‌లో ప్రత్యేక మెజారిటీ అవసరం. లోక్‌సభలో ప్రస్తుతం 540 మంది సభ్యులుండగా, మొత్తం సభ్యుల్లో మూడింట రెండొంతుల మద్దతు కీలకం. ఈ లెక్కన సుమారు 360 మంది సభ్యుల మద్దతు అవసరం. ఎన్డీయేకు లోక్‌సభలో మెజారిటీ ఉన్నప్పటికీ, రాజ్యాంగ సవరణకు అవసరమైన సంఖ్యాబలం విషయంలో సవాళ్లు ఉన్నట్లు సమాచారం.ప్రభుత్వానికి మద్దతు పెరిగిందని, తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 20 మంది ఎంపీలు, శివసేన (యూబీటీ)కి చెందిన ఆరుగురు ఎంపీలు అధికార పక్షం వైపు మారారని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అయితే బిల్లుల ఆమోదానికి అవసరమైన సంఖ్యాబలంపై తుది స్పష్టత ఓటింగ్ సమయంలోనే రానుంది.

డీఎంకేతో చర్చలు

బిల్లులకు మద్దతు కూడగట్టేందుకు డీఎంకేతో కేంద్రం చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. తమిళనాడు ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌తో ఆ పార్టీ విభేదాలు రావడం, ఇండియా కూటమి నుంచి బయటకు రావడం నేపథ్యంలో ఈ సంప్రదింపులకు ప్రాధాన్యం ఏర్పడింది. మరికొన్ని చిన్న ప్రతిపక్ష పార్టీలతోనూ కేంద్రం మాట్లాడుతున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.ఆగస్టు 13న ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ఇంకా అధికారికంగా ప్రొరోగేషన్ ప్రకటించలేదు. దీంతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించేందుకు అవకాశం ఉందని సమాచారం. అక్టోబర్ 26, 27 తేదీల్లో సంవిధాన్ సదన్‌లో జరగనున్న 12వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరమ్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక సమావేశాల తేదీలను ఖరారు చేయనున్నట్లు తెలుస్తోంది. సమావేశాలకు వారం రోజుల ముందుగా నోటీసు ఇచ్చే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

బంగ్లాదేశ్ తరహాలో పాలన మార్పునకు కాంగ్రెస్ కుట్ర..

భారత్‌లో బంగ్లాదేశ్ తరహా పాలన మార్పునకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని రాజ్‌నాథ్ ఆరోపణ

ప్రజాస్వామ్యం పేరుతో దేశంలో అరాచకం సృష్టించాలని చూస్తోందని విమర్శ

రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నేతలపై రక్షణ మంత్రి తీవ్ర వ్యాఖ్యలు

అధికారం కోసమే రాజ్యాంగ సంస్థలను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపణ

ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీని ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌పై విమర్శలు

న్యూఢిల్లీ, అక్టోబర్16,(సామాన్యుడి అస్త్రం)

బంగ్లాదేశ్‌లో జరిగిన తరహాలో భారత్‌లోనూ పాలన మార్పునకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుతున్నామనే పేరుతో దేశంలో అరాచకాన్ని సృష్టించేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారని, రాజ్యాంగ సంస్థలను దెబ్బతీయడమే వారి లక్ష్యమని విమర్శించారు. శుక్రవారం ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కాంగ్రెస్, రాహుల్ గాంధీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.దేశంలో ఇటీవలి పరిణామాలు అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయని రాజ్‌నాథ్ అన్నారు. యువత శక్తిని దేశ అభివృద్ధికి వినియోగించకుండా, రాజకీయ అస్థిరత సృష్టించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బంగ్లాదేశ్ తరహాలో పాలన మార్పు తీసుకురావాలని కాంగ్రెస్ నేతలు బహిరంగంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. వారి వ్యాఖ్యలను బట్టి ప్రజాస్వామ్య సంస్థలను బలహీనపరచడమే ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోందన్నారు.

అధికారం కోసమే అరాచకమా?

ఎన్నికల సంఘం, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్నామని కాంగ్రెస్ చెబుతున్నా.. అసలు లక్ష్యం అధికారం చేజిక్కించుకోవడమేనని రాజ్‌నాథ్ ఆరోపించారు. 'పాలన మార్పు' వంటి పదాలను ఉపయోగించడం వెనుక ఉద్దేశం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. రాజకీయ స్వార్థం కోసం దేశ ప్రయోజనాలను పక్కనపెడితే ప్రజాస్వామ్య చర్చలు వాస్తవాల ఆధారంగా కాకుండా మొండివైఖరి, దుష్ప్రచారానికి వేదికగా మారతాయని వ్యాఖ్యానించారు.ప్రజాస్వామ్యం పేరుతో అరాచకాన్ని సృష్టించడానికి, రాజ్యాంగ సంస్థలపై దాడులకు, దేశాభివృద్ధికి ఆటంకం కలిగించడానికి ఎవరికీ హక్కు లేదని రాహుల్ గాంధీని ఉద్దేశించి అన్నారు. చట్టాలను గౌరవిస్తూ శాంతిభద్రతలను కాపాడుకోవాలని, రాజకీయ ప్రయోజనాల కోసం రాజ్యాంగ వ్యవస్థలను దెబ్బతీయకూడదని సూచించారు. ప్రజల తీర్పును గౌరవించి, ప్రజాస్వామ్యాన్ని కాపాడుతున్నామనే పేరుతో రాజకీయ గందరగోళం సృష్టించడం మానుకోవాలని రాహుల్‌కు హితవు పలికారు.

ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని గుర్తుచేస్తూ..

కాంగ్రెస్ గతంలోనూ ప్రజాస్వామ్య, రాజ్యాంగ



విలువలను దెబ్బతీసిందని రాజ్‌నాథ్ విమర్శించారు. 1975లో ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ, 1984లో సిక్కులపై జరిగిన హింస, 1990లో కరసేవకుల హత్యలకు సంబంధించిన పరిణామాలను ప్రస్తావించారు. నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ వైఖరిలో మార్పు లేదని ఆరోపించారు."1975లో ఇందిరాగాంధీ ప్రజాస్వామ్యాన్ని జైల్లో పెట్టారు. ఇప్పుడు రాహుల్ గాంధీ జేబులో రాజ్యాంగాన్ని పెట్టుకుని అరాచకం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు" అని రాజ్‌నాథ్ వ్యాఖ్యానించారు.ఎన్నికల సంఘాన్ని కాంగ్రెస్ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుందని కూడా ఆయన ఆరోపించారు. 1993లో ఎన్నికల కమిషనర్ల నియామకం, అప్పటి ప్రధాన ఎన్నికల కమిషనర్ టీఎన్ శేషన్.. ఎన్నికల కమిషనర్ నవీన్ చావ్లాపై చేసిన ఆరోపణలను ప్రస్తావించారు. చావ్లా కాంగ్రెస్ నేతలకు ఎన్నికల సంఘానికి సంబంధించిన రహస్య సమాచారాన్ని చేరవేశారని శేషన్ ఆరోపించినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆయనను తొలగించకుండా కాపాడటమే కాకుండా, తర్వాత ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నియమించిందని రాజ్‌నాథ్ విమర్శించారు.

8 డాలర్లతో హైదరాబాద్ విడిచి కెనడా వెళ్లారు..

1972లో కేవలం 8 డాలర్లతో కెనడాకు వెళ్లిన హైదరాబాద్ వాసి ప్రేమ్ వత్సా

ఐఐటీ మద్రాస్‌లో కెమికల్ ఇంజినీరింగ్..

కెనడాలో ఎంబీఏ పూర్తి

ఫెయిర్‌ఫ్యాక్స్ ఫైనాన్షియల్‌ను అంతర్జాతీయ బీమా, పెట్టుబడుల సంస్థగా తీర్చిదిద్దిన ప్రేమ్

ఐడీబీఐ బ్యాంక్‌లో 60.72 శాతం వాటాను రూ.52,878 కోట్లకు కొనుగోలు చేయాలని ప్రతిపాదన

ఈ ఒప్పందానికి కేంద్ర కేబినెట్ ఆమోదం..

లావాదేవీ పూర్తయితే తగ్గనున్న కేంద్రం, ఎల్ఐసీ వాటాలు

న్యూఢిల్లీ, అక్టోబర్16,

1972లో జేబులో కేవలం 8 డాలర్లతో భారత్ నుంచి కెనడాకు వెళ్లిన వ్యక్తి.. ఇప్పుడు రూ.వేల కోట్ల పెట్టుబడితో భారత బ్యాంకింగ్ రంగంలో కీలక ఒప్పందానికి సిద్ధమయ్యారు. ఆయనే హైదరాబాద్‌లో పుట్టి, కెనడాలో బిలియనీర్‌గా ఎదిగిన ప్రేమ్ వత్సా. ఆయన నేతృత్వంలోని ఫెయిర్‌ఫ్యాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్ సంస్థ.. ఐడీబీఐ బ్యాంక్‌లో 60.72 శాతం వాటాను రూ.52,878 కోట్లకు కొనుగోలు చేయనుంది. ఈ ప్రతిపాదనకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.భారత బ్యాంకింగ్ రంగంలో అతిపెద్ద విదేశీ పెట్టుబడుల్లో ఇదొకటి. ఐడీబీఐ బ్యాంక్‌లో కేంద్ర ప్రభుత్వం, ఎల్ఐసీకి ఉన్న వాటాలను తగ్గించుకొని, ప్రైవేటు పెట్టుబడిదారుడికి నిర్వహణ నియంత్రణ అప్పగించే ప్రక్రియలో ఇదొక కీలక అడుగు. అయితే ఈ లావాదేవీకి ఇంకా అవసరమైన నియంత్రణ సంస్థల అనుమతులు రావాల్సి ఉంది.

వయసుతో పాటు గుండె లయ తప్పుతోందా?



వయసు పెరిగేకొద్దీ సాధారణమయ్యే గుండె లయ సమస్య 'ఏట్రియల్ ఫిబ్రిలేషన్'

ఈ సమస్య ఉన్నవారిలో స్ట్రోక్ వచ్చే ప్రమాదం 3 నుంచి 5 రెట్లు అధికం

గుండె దడ, అలసట, ఆయాసం వంటివి దీని ప్రధాన లక్షణాలు

భారత్‌లో సుమారు 79 లక్షల మంది ఈ సమస్యతో బాధపడుతున్నారని అంచనా

లక్షణాలను ముందుగా గుర్తించి చికిత్స తీసుకోవడం అత్యంత ముఖ్యమంటున్న నిపుణులు

వయసు పెరిగే కొద్దీ శరీరంలో అనేక మార్పులు రావడం సహజం. అయితే, కొన్ని మార్పులను సాధారణమైనవిగా భావించి నిర్లక్ష్యం చేస్తే తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు. అలాంటి వాటిలో ముఖ్యమైనది గుండె లయకు సంబంధించిన సమస్య అయిన 'ఏట్రియల్ ఫిబ్రిలేషన్' (ూఖీఱఎ). ఇది వయసుతో పాటు సర్వసాధారణంగా కనిపించే సమస్య అయినప్పటికీ, దీనిని వృద్ధాప్యంలో ఒక సాధారణ భాగంగా పరిగణించకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సకాలంలో గుర్తించకపోతే ఇది స్ట్రోక్ వంటి ప్రాణాంతక పరిస్థితులకు దారితీసే ప్రమాదం ఉంది.

ఏమిటీ ఏట్రియల్ ఫిబ్రిలేషన్?

సాధారణంగా మన గుండె ఒక నిర్దిష్టమైన లయతో కొట్టుకుంటుంది. అయితే, ఏట్రియల్ ఫిబ్రిలేషన్ ఉన్నవారిలో గుండె పై గదులైన కర్ణికలలో విద్యుత్ సంకేతాలు అస్తవ్యస్తంగా మారిపోతాయి. దీనివల్ల గుండె వేగంగా, అసాధారణ లయతో కొట్టుకోవడం మొదలవుతుంది. వయసు పెరిగే కొద్దీ ఈ సమస్య బారిన పడే వారి సంఖ్య పెరుగుతోంది. గణాంకాల ప్రకారం 60 ఏళ్ల వయసు వారిలో సుమారు 3 నుంచి 4 శాతం మందిలో ఈ సమస్య కనిపిస్తే, 80 ఏళ్లు వచ్చేసరికి ఇది 8 శాతానికి పెరుగుతుంది. మన దేశంలో దాదాపు 79 లక్షల మంది ఏట్రియల్ ఫిబ్రిలేషన్‌తో జీవిస్తున్నారని ఒక అంచనా.

వయసుతో పాటు ముప్పు ఎందుకు పెరుగుతుంది?

వయసు పైబడటం వల్ల గుండె నిర్మాణంలో కొన్ని మార్పులు చోటుచేసుకుంటాయి. గుండె కండరాలు గట్టిపడటం, కర్ణికలు సాగడం లేదా వాటి పరిమాణం పెరగడం, గుండె కణజాలంలో మచ్చల వంటి ఫైబ్రోసిస్ ఏర్పడటం వంటి కారణాల వల్ల సాధారణ విద్యుత్ సంకేతాలకు అంతరాయం కలుగుతుంది. ఇది ఏట్రియల్ ఫిబ్రిలేషన్‌కు దారితీస్తుంది.

లక్షణాలు ఎలా ఉంటాయి?

ఏట్రియల్ ఫిబ్రిలేషన్ లక్షణాలు వ్యక్తిని బట్టి మారుతూ ఉంటాయి. గుండె దడగా అనిపించడం, తీవ్రమైన అలసట, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది (ఆయాసం), నిలకడ లేకపోవడం లేదా కళ్లు తిరగడం వంటివి ప్రధాన లక్షణాలు. అయితే, వృద్ధులలో చాలామంది ఈ లక్షణాలను వయసు వల్ల కలిగే నీరసంగా లేదా ఇతర అనారోగ్య సమస్యలుగా పొరబడే అవకాశం ఉంది. ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే.. కొందరిలో ఎలాంటి లక్షణాలు బయటకు కనిపించకపోవచ్చు. దీనివల్ల సమస్య ఉన్నట్టు తెలియక ప్రమాదం ముదిరిపోతుంది. సాధారణ గుండె లయ ఉన్నవారితో పోలిస్తే, ఏట్రియల్ ఫిబ్రిలేషన్ ఉన్నవారిలో స్ట్రోక్ వచ్చే ప్రమాదం 3 నుంచి 5 రెట్లు ఎక్కువగా ఉంటుందని అధ్యయనాలు చెబుతున్నాయి.

ఒంటి కాలిపై 10 సెకన్లు నిలబడగలరా?



ఒంటి కాలిపై 10 సెకన్ల పాటు నిలబడటం చాలా చిన్న విషయంలా అనిపించవచ్చు. కానీ మన శరీర సమతుల్యత, కండరాల బలం, నాడీ వ్యవస్థ పనితీరు గురించి ఇది కొన్ని కీలక విషయాలను తెలియజేస్తుంది. ముఖ్యంగా వయసు పెరిగే కొద్దీ శరీరంలో వచ్చే మార్పులు మన బ్యాలెన్స్‌పై ప్రభావం చూపుతాయి. కొందరు సులభంగా ఒక్క కాలిపై నిలబడగలిగితే.. మరికొందరు తడబడుతుంటారు. ఇలాంటి సమస్యలు వృద్ధాప్యంలో పడిపోయి గాయాలపాలయ్యే ప్రమాదాన్ని పెంచవచ్చు.అయితే, ఒక్క కాలిపై 10 సెకన్లు నిలబడలేకపోయినంత మాత్రాన ఏదో తీవ్రమైన అనారోగ్యం ఉన్నట్లు భావించకూడదు. వయసు, కండరాల బలం, కీళ్ల పనితీరు, చూపు, నాడీ వ్యవస్థతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు కూడా దీనిపై ప్రభావం చూపుతాయి.ఒంటి కాలిపై నిలబడాలంటే శరీరంలోని పలు వ్యవస్థలు సమన్వయంతో పనిచేయాలి. కండరాలు శరీర బరువును మోయాలి. కీళ్లు స్థిరంగా ఉండాలి. కళ్లు, లోపలి చెవి నుంచి అందే సమాచారాన్ని మెదడు విశ్లేషించి శరీరం పడిపోకుండా నియంత్రించాలి. వీటిలో ఏ వ్యవస్థ పనితీరు దెబ్బతిన్నా సమతుల్యతను కాపాడుకోవడం కష్టమవుతుంది. 2022లో 'బ్రిటిష్ జర్నల్ ఆఫ్ స్పోర్ట్స్ మెడిసిన్'లో ప్రచురితమైన ఓ అధ్యయనం ప్రకారం.. ఒక్క కాలిపై 10 సెకన్లు నిలబడలేని మధ్య వయస్కులు, వృద్ధుల్లో తర్వాతి సంవత్సరాల్లో ఏ కారణంతోనైనా మరణించే ప్రమాదం ఎక్కువగా ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. అయితే, ఈ అధ్యయనం ఆధారంగా ఒక్క కాలిపై నిలబడలేని ప్రతి ఒక్కరికీ ప్రాణాపాయం ఉందని చెప్పలేం. ఇది ఆరోగ్య పరిస్థితిని అంచనా వేయడానికి ఉపయోగపడే ఒక సూచన మాత్రమే.

ఫోన్ ఎక్కువగా చూస్తున్నారా? మెడనొప్పి వస్తోందా?


స్మార్ట్‌ఫోన్ల మితిమీరిన వాడకంతో 'టెక్స్ నెక్ సిండ్రోమ్' కేసులు పెరుగుతున్నాయన్న నిపుణులు

ఫోన్ చూసేందుకు తల వంచితే మెడపై దాదాపు 22 కిలోల సమానమైన భారం పడుతుందని వెల్లడి

మెడనొప్పి, చేతుల్లో తిమ్మిర్లు, తలనొప్పి వంటివి ఈ సమస్య ప్రధాన లక్షణాలు

ప్రతి 20 నిమిషాలకు విరామం తీసుకుని, పరికరాలను కంటి స్థాయిలో ఉంచి వాడటం ముఖ్యం

నొప్పి తీవ్రంగా ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించడం మంచిదని సలహా



నేడు ప్రపంచ 'స్పైన్ డే'. ఆధునిక జీవనశైలి కారణంగా వెన్నెముక ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు ఈ రోజును ప్రత్యేకంగా పాటిస్తారు. అయితే, మారుతున్న కాలంతో పాటు కొత్త ఆరోగ్య సమస్యలూ పుట్టుకొస్తున్నాయి. అందులో ముఖ్యమైనదే 'టెక్స్ నెక్ సిండ్రోమ్'. స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, టాబ్లెట్‌ల వంటి డిజిటల్ స్క్రీన్లను గంటల తరబడి చూడటం వల్ల ఈ సమస్య తీవ్రంగా విస్తరిస్తోందని ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎందుకింత ప్రమాదకరం?

సాధారణంగా నిటారుగా ఉన్నప్పుడు మన తల బరువు సుమారు 4.5 నుంచి 5 కిలోల వరకు ఉంటుంది. కానీ, మనం స్మార్ట్‌ఫోన్ చూడటానికి తలను ముందుకు వంచినప్పుడు, మెడలోని వెన్నుపూసలపై (సెర్వికల్ స్పైన్) పడే ఒత్తిడి ఏకంగా 22 కిలోల బరువుకు సమానంగా పెరుగుతుంది. ఈ అదనపు భారం మెడ కండరాలపై తీవ్రమైన ఒత్తిడిని కలిగిస్తుంది. ఇది చాలా కాలం కొనసాగితే మెడలోని సహజమైన వంపు దెబ్బతినడం, వెన్నుపూసల మధ్య ఉండే డిస్క్‌లు అరిగిపోవడం, నరాలు నొక్కుకుపోవడం వంటి తీవ్రమైన సమస్యలకు దారితీస్తుంది.

ప్రధాన లక్షణాలు ఇవే..

ప్రారంభంలో మెడనొప్పి, మెడ కండరాలు బిగుసుకుపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. చాలామంది దీనిని సాధారణ నొప్పే కదా అని నిర్లక్ష్యం చేస్తారు. కానీ, సమస్య ముదిరితే భుజాలు, చేతులు, వేళ్లలోకి తిమ్మిర్లు పాకడం, తల వెనుక భాగంలో తీవ్రమైన తలనొప్పి, కళ్లు తిరగడం, మెడను స్వేచ్ఛగా కదిలించలేకపోవడం, భుజాలు త్వరగా అలసిపోవడం వంటి ఇబ్బందులు ఎదురవుతాయి.

నివారణ మార్గాలు

కొన్ని సాధారణ జాగ్రత్తలు పాటించడం ద్వారా 'టెక్స్ నెక్ సిండ్రోమ్' బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చు.

ఫోన్ లేదా ఇతర పరికరాలను కంటికి సమానమైన స్థాయిలో (వఎవ శ్రీవజఎవశ్రీ) ఉంచి వాడాలి.

ప్రతి 20-30 నిమిషాలకు ఒకసారి విరామం తీసుకుని, మెడకు చిన్నపాటి వ్యాయామాలు చేయాలి. గడ్డాన్ని ఛాతీకి ఆనించడం (చిన్ టక్స్), మెడను నెమ్మదిగా గుండ్రంగా తిప్పడం వంటివి మేలు చేస్తాయి.

కుర్చీలో కూర్చున్నప్పుడు వెన్నెముకకు సపోర్ట్ ఉండేలా నిటారుగా కూర్చోవాలి.

పనిచేసే చోట ఎర్గోనామిక్ కుర్చీలు, ల్యాప్‌టాప్ స్టాండ్‌లు వాడటం వల్ల మెడపై ఒత్తిడి తగ్గుతుంది.ఒకవేళ మెడనొప్పి దీర్ఘకాలంగా వేధిస్తున్నా, తిమ్మిర్లు చేతులకు పాకుతున్నా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి. తొలిదశలోనే సరైన చికిత్స తీసుకుంటే వెన్నెముక ఆరోగ్యాన్ని దీర్ఘకాలం పాటు కాపాడుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

వేలికి రింగ్.. ఆరోగ్యంపై పూర్తి నిఘా?



నిద్ర, గుండె స్పందన, కదలికలపై ఫిట్‌నెస్ రింగ్‌తో అంచనాలు

రోజువారీ అలవాట్లను మెరుగుపరచుకునే అవకాశం

రీడింగ్స్ వైద్య పరీక్షలకు ప్రత్యామ్నాయం కాదని గ్రహించాలి

పదేపదే ట్రాకింగ్‌తో ఆందోళన పెరిగే ప్రమాదం

ఆరోగ్య సమస్యలుంటే వైద్యుడి సలహా తప్పనిసరి

స్మార్ట్‌వాచ్ పెట్టుకోవడం ఇష్టం లేదా? ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు గమనించాలనుకుంటున్నారా? అయితే ఫిట్‌నెస్ రింగ్స్ మీకు మరో ప్రత్యామ్నాయం. ఓరా, రింగ్‌కాన్ వంటి కంపెనీలు తయారు చేస్తున్న ఈ చిన్నపాటి రింగ్స్ ద్వారా నిద్ర, గుండె స్పందన, శారీరక చలనం, వ్యాయామం తర్వాత శరీరం కోలుకునే తీరు వంటి అంశాలను అంచనా వేయొచ్చు. చేతికి స్క్రీన్ ఉన్న వాచ్ ధరించాల్సిన అవసరం లేకుండానే రోజంతా ఈ వివరాలను తెలుసుకోవచ్చు. అయితే వీటితో లాభాలున్నట్టే కొన్ని పరిమితులూ ఉన్నాయి. నిపుణులు ఏం చెబుతున్నారు? ఇవి ఎవరికి ఉపయోగపడతాయి? ఎవరు జాగ్రత్తగా ఉండాలి?

ఫిట్‌నెస్ రింగ్స్‌తో ఏం తెలుసుకోవచ్చు?

నిద్ర: ఎంతసేపు నిద్రపోయారు? మధ్యలో ఎన్నిసార్లు మెలకువ వచ్చింది? నిద్ర సమయాలు ఎలా ఉన్నాయి?
గుండె స్పందన: గుండె కొట్టుకునే వేగం, రెండు స్పందనల మధ్య వ్యవధిలో మార్పులు (హెచ్ఆర్‌వీ) వంటి వివరాలు.
శారీరక చలనం: రోజులో ఎన్ని అడుగులు వేశారు? ఎంత కదిలారు? ఎన్ని కేలరీలు ఖర్చయ్యాయి?
ఆక్సిజన్ స్థాయి: కొన్ని మోడళ్లు రక్తంలోని ఆక్సిజన్ స్థాయిని అంచనా వేస్తాయి.
గుండె లయ: కొన్ని పరికరాల్లో ఈసీజీ రికార్డింగ్ సదుపాయం ఉంటుంది.అయితే అన్ని రింగ్స్‌లోనూ ఈ ఫీచర్లన్నీ ఉండవు. వీటి రీడింగ్స్ వైద్య పరీక్షలకు ప్రత్యామ్నాయం కూడా కావనే విషయాన్ని గమనించాలి.

ఫిట్‌నెస్ రింగ్స్‌తో ప్రయోజనాలేంటి?

నిద్రపై అవగాహన: ప్రతిరోజూ ఆలస్యంగా పడుకోవడం, సరిపడా నిద్ర లేకపోవడం వంటి అలవాట్లను గుర్తించేందుకు ఇవి ఉపయోగపడతాయి. నిద్ర, రోజువారీ చలనంపై మెరుగైన నిర్ణయాలు తీసుకోవడానికి ఇది ఉపయోగపడుతుందని పలువురు వినియోగదారులు తెలిపారు.వ్యాయామానికి ప్రోత్సాహం: ఎక్కువసేపు కూర్చునే ఉద్యోగులు మధ్యమధ్యలో నడవడానికి, రోజువారీ కదలికలను పెంచుకోవడానికి ఇవి గుర్తుచేస్తాయి. అయితే రింగ్ పెట్టుకున్నంత మాత్రాన ఆరోగ్యం మెరుగుపడదు. దాని ద్వారా తెలుసుకున్న సమాచారాన్ని మనం ఎలా ఉపయోగించుకుంటామన్నదే ముఖ్యమనే విషయాన్ని గ్రహించాలి.వైద్యులకు అదనపు సమాచారం: కొన్ని పరికరాల్లోని ఈసీజీ రికార్డింగ్స్ ద్వారా గుండె స్పందనలో అసాధారణ మార్పులను గుర్తించేందుకు వైద్యులకు కొంత సమాచారం అందించవచ్చు. అయితే వీటితో గుండెపోటును నిర్ధారించలేం, పూర్తిగా తోసిపుచ్చలేం కూడా.

నష్టాలు, పరిమితులు ఏంటి?

అనవసర ఆందోళన: నిద్ర స్కోర్, గుండె స్పందన, హెచ్ఆర్‌వీ వివరాలను పదేపదే పరిశీలించడం కొందరిలో ఆరోగ్యంపై ఆందోళన పెంచవచ్చు. గుండె స్పందనలో మార్పులన్నీ అనారోగ్యానికి సంకేతాలు కావని డాక్టర్లు చెబుతున్నారు.తప్పుడు అంచనాలు: రింగ్ సరిగా లేకపోవడం, కదలికలు, సెన్సర్ల పరిమితుల వల్ల రీడింగ్స్‌లో తప్పులు రావచ్చు. సాధారణ రీడింగ్స్ ఉన్నంత మాత్రాన ఆరోగ్య సమస్యలు లేవని భావించకూడదు.వ్యాయామంలో అసౌకర్యం: వెయిట్ ట్రైనింగ్ చేసేటప్పుడు డంబెల్స్, బార్బెల్స్ వల్ల రింగ్ అసౌకర్యంగా అనిపించవచ్చు. దెబ్బతినే ప్రమాదమూ ఉంది. రన్నింగ్ సమయంలో స్క్రీన్‌పై వివరాలను వెంటనే చూడాలనుకునేవారికి స్మార్ట్‌వాచ్ అనుకూలంగా ఉండొచ్చు.

ఎవరు కొనాలి? ఎవరికి వద్దు?

నిద్ర, రోజువారీ కదలికలు, వ్యాయామం తర్వాత కోలుకునే తీరును గమనించాలనుకునేవారికి ఫిట్‌నెస్ రింగ్స్ ఉపయోగపడతాయి. అయితే ఆరోగ్య వివరాలను పదేపదే చూసుకుంటూ ఆందోళన చెందేవారు వీటిని కొనేముందు ఆలోచించాలి. కొనుగోలు చేసే ముందు ధర, బ్యాటరీ, సౌకర్యం, యాప్ సదుపాయాలు, సబ్‌స్క్రిప్షన్ ఖర్చులు, వ్యక్తిగత సమాచార గోప్యత వంటి అంశాలను పరిశీలించాలి.

కాంటాక్ట్ లెన్స్ వాడుతున్నారా?.. నీళ్లతో ఈ పొరపాటు చేస్తే కంటిచూపుకే ప్రమాదం

నేటి ఆధునిక జీవనశైలిలో చాలామంది కళ్లజోడుకు బదులుగా కాంటాక్ట్ లెన్స్‌లు వాడటానికి ఇష్టపడుతున్నారు. అయితే, వాటిని ఉపయోగించేటప్పుడు సరైన పరిశుభ్రత పాటించకపోతే తీవ్రమైన కంటి ఇన్ఫెక్షన్లు సోకి, కంటిచూపుకే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని అమెరికాకు చెందిన సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సీడీసీ), ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) వంటి ప్రముఖ ఆరోగ్య సంస్థలు హెచ్చరిస్తున్నాయి. కాంటాక్ట్ లెన్స్‌లకు, నీటికి మధ్య ఎట్టిపరిస్థితుల్లోనూ సంబంధం ఉండకూడదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

నీరు ఎందుకు ప్రమాదకరం?

సాధారణంగా మనం తాగే కుళాయి నీరు, బాటిల్ నీరు, షవర్ నీరు, స్విమ్మింగ్ పూల్‌లోని నీరు ఏవీ పూర్తిగా శుభ్రమైనవి (స్టెరైల్) కావు. వీటిలో 'అకాంతమీబా' వంటి కంటికి కనిపించని ప్రమాదకరమైన సూక్ష్మజీవులు ఉంటాయి. ఈ సూక్ష్మజీవులు కాంటాక్ట్ లెన్స్‌కు, కంటిలోని కార్నియాకు మధ్య చిక్కుకున్నప్పుడు 'అకాంతమీబా కెరటైటిస్' అనే తీవ్రమైన ఇన్ఫెక్షన్‌కు కారణమవుతాయి. ఇది చాలా అరుదైనప్పటికీ, తీవ్రమైన నొప్పితో కూడి ఉంటుంది. దీనికి చికిత్స అందించడం కూడా కష్టం. కొన్నిసార్లు ఇది కార్నియాపై మచ్చలకు, శాశ్వతంగా కంటిచూపు దెబ్బతినడానికి లేదా కార్నియా మార్పిడి ఆపరేషన్ చేయాల్సిన పరిస్థితికి దారితీయవచ్చు. అంతేకాకుండా, నీరు తగలడం వల్ల సాఫ్ట్ లెన్స్‌లు ఉబ్బి, వాటి ఆకారం మారి కంటికి అతుక్కుపోతాయి. దీనివల్ల కార్నియాపై గీతలు పడి, ఇన్ఫెక్షన్‌కు కారణమయ్యే సూక్ష్మక్రిములు కంటిలోకి ప్రవేశించడానికి మార్గం సులభమవుతుంది.కాంటాక్ట్ లెన్స్ వాడే ప్రతి ఒక్కరూ తమ కళ్ల ఆరోగ్యం కోసం ఈ కింద సూచించిన జాగ్రత్తలను తప్పనిసరిగా పాటించాలి.

ప్రేమంటే ఇదీ.. తన మనసులో మాట చెప్పిన హీరోయిన్

ప్రేమ బంధంలో తనదైన స్వేచ్ఛ ఉండాలని, మనసులోని భావాలను ఎలాంటి సంకోచం లేకుండా పంచుకోగలగాలని హీరోయిన్ ఐశ్వర్య లక్ష్మిఅభిప్రాయపడ్డారు. జీవిత భాగస్వామితో తన సహజమైన వ్యక్తిత్వాన్ని కాపాడుకుంటూనే, సంతోషంగా జీవించాలనుకుంటున్నట్లు ఆమె వెల్లడించారు.తాజా ఇంటర్వ్యూలో ప్రేమ, సంబంధాలు, జీవిత భాగస్వామి(గురించి మాట్లాడిన ఐశ్వర్య.. బంధంలో స్నేహానికి ప్రత్యేక స్థానం ఉంటుందని పేర్కొన్నారు. ఒకరితో ఒకరు హాయిగా మాట్లాడుకోవడం, భావాలను స్వేచ్ఛగా వ్యక్తపరచడం, నిజాయితీగా ఉండటం ఆరోగ్యకరమైన బంధానికి ముఖ్యమని ఆమె మాటలు సూచిస్తున్నాయి.తెరపై గాఢమైన ప్రేమకథల్లో కనిపించినా, వ్యక్తిగత జీవితంలో మాత్రం సింపుల్‌గా, సంతోషంగా సాగే ప్రేమకథలంటేనే తనకు ఇష్టమని ఐశ్వర్య తెలిపారు. బాధ, విరహం చుట్టూ తిరిగే కథల కంటే ఆనందాన్ని పంచే ప్రేమ బంధాలే తనకు నచ్చుతాయని చెప్పారు.తన జీవిత భాగస్వామి దగ్గర ఎలాంటి నటన లేకుండా సహజంగా ఉండగలగాలని, చిన్నపిల్లలా మనసు విప్పి మాట్లాడగలగాలని ఆమె కోరుకుంటున్నారు. దాపరికాలు లేని అనుబంధం, పరస్పర అవగాహన, నిజాయితీతో కూడిన బంధమే తనకు ముఖ్యమనే విషయాన్ని ఆమె వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి



ఆ రెండేళ్లూ నరకం చూశా..



ప్రముఖ నటి అనుపమ పరమేశ్వరన్ తన గతానికి సంబంధించి కొన్ని సంచలన విషయాలను బయటపెట్టారు. గతంలో ఒక వ్యక్తితో ఉన్న రెండేళ్ల రిలేషన్‌షిప్‌లో తాను తీవ్రమైన మానసిక వేధింపునకు గురయ్యానని తెలిపారు. తన తాజా చిత్రం 'క్రేజీ కళ్యాణం' ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలలో ఈ విషయాలను వెల్లడించారు. ఆ అనుభవం తనను మానసికంగా కుంగదీసిందని, వృత్తిపరంగా ఎంతో నష్టపరిచిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.ఆ చేదు అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ.. "అద్దంలో చూసుకుంటే మీరు మీకు కనిపించరు. ఆ సమయంలో నన్ను నేను గుర్తుపట్టలేకపోయాను.

చూపు తిప్పుకోనివ్వని అందంతో సాయి పల్లవి



దేశవ్యాప్తంగా సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'రామాయణ'. ఈ భారీ బడ్జెట్ సినిమా అంతర్జాతీయ ట్రైలర్ విడుదల కార్యక్రమం నిన్న బెంగళూరులో అట్టహాసంగా జరిగింది. ఈ వేడుకలో సీత పాత్రధారి సాయి పల్లవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తన పాత్రకు తగ్గట్టుగా, సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తూ ఆమె ధరించిన గులాబీ రంగు పట్టుచీర అందరి దృష్టినీ ఆకర్షించింది.నితీశ్ తివారీ దర్శకత్వంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న ఈ సినిమా తొలి భాగాన్ని దీపావళి కానుకగా విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో నిర్వహించిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు చిత్రబృందం మొత్తం హాజరైంది. రాముడి పాత్రలో నటిస్తున్న రణ్‌బీర్ కపూర్, రావణుడిగా యశ్, ఇంకా రవి దూబే, రకుల్ ప్రీత్ సింగ్, సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ వంటి ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


ట్విస్టులు, టర్న్‌తో వినోదం పంచే చిత్రమిది

స్టార్ డైరెక్టర్ వెంకీ కుడుముల) నిర్మాతగా వాట్ నెక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై తెరకెక్కిస్తున్న చిత్రం 'ఇట్లు అర్జున'. ఈ సినిమాతో అనీష్ హీరోగా పరిచయం అవుతుండగా, కొత్త దర్శకుడు మహేశ్ ఉప్పల తెరకెక్కిస్తున్నారు. అనస్వర రాజన్ ఇందులో కథానాయిక. ఈ సినిమా అక్టోబర్ 30న థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ బిగ్ రివిల్ చేశారు. అక్కినేని నాగార్జునసమర్పణలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుందని ప్రకటించారు. ఈ మేరకు మేకర్స్ ఏర్పాటుచేసిన ప్రెస్‌మీట్‌లో నాగార్జున మాట్లాడుతూ.. "కొత్త టాలెంట్ అంటే నాకు చాలా ఇష్టం.కథ మీద నమ్మకంతో సినిమాను అద్భుతంగా పూర్తిచేశారు. పూర్తి సినిమా చూశా.. చాలా నచ్చింది. సినిమా అంతా ట్విస్టులు, టర్న్స్‌తో నడుస్తూ హిలేరియస్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో ఉంటుంది. ఈ సినిమాకు సమర్పకుడిగా ఉండటం చాలా గర్వంగా, సంతోషంగా ఉంది" అన్నారు.



'రణబాలి' - మూవీ రివ్యూ!

లవ్ .. రొమాన్స్ నేపథ్యంలోని కథలలో, తనదైన మాస్ యాక్షన్ మార్క్ చూపిస్తూ విజయ్ దేవరకొండ ముందుకు వెళుతున్నాడు. అలాంటి విజయ్ దేవరకొండ ఈ సారి చారిత్రక నేపథ్యంలో కథను ఎంచుకుని .. లుక్ మార్చుకుని ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. అలా ఆయన చేసిన సినిమానే 'రణబాలి'. పెళ్లి తరువాత విజయ్ దేవరకొండ – రష్మిక కలిసి చేసిన సినిమా కావడంతో సహజంగానే అంచనాలు పెరిగిపోయాయి. గతంలో చారిత్రక నేపథ్యం కలిగిన 'శ్యామ్ సింగరాయ్'తో నానీకి హిట్ ఇచ్చిన రాహుల్ సాంకృత్యన్, ఈ సినిమాతో విజయ్ దేవరకొండకి కూడా హిట్ ఇచ్చినట్టేనా అనేది చూద్దాం.అది 1870ల నాటి కాలం .. భారతదేశంపై ఆంగ్లేయులు ఆధిపత్యాన్ని చెలాయిస్తున్న రోజులవి. బ్రిటీష్ కమిషనర్ (ఆర్నాల్డ్ వస్లూ) సీమ ప్రాంతం నుంచి 5 లక్షల టన్నుల ధాన్యాన్ని గూడ్స్ రైళ్ల ద్వారా తరలించి, మద్రాస్ ఓడరేవు నుంచి ఇంగ్లండ్ కి చేరవేసే ఆలోచనలో ఉంటాడు. అయితే అతనికి 'శింగనమల' ప్రాంతం నుంచి సవాల్ ఎదురవుతుంది. ఎందుకంటే 'రణబాలి' (విజయ్ దేవరకొండ) ఆ ప్రాంతానికి రక్షకుడిగా ఉంటాడు. అతనిని ఎదిరించే ధైర్యం .. ప్రశ్నించే దమ్ము ఎవరికీ లేవని ఆ ప్రాంత ప్రజలు నమ్ముతూ ఉంటారు. 'శింగనమల' ప్రజలు అక్కడి కొండపై గల గుహలో ఉన్న ఒక అతీత శక్తి తమని కాపాడుతుందని నమ్ముతుంటారు. 'రణబాలి' కారణజన్ముడనే విషయాన్ని అతని తల్లితో ఆ శక్తియే చెబుతుంది. అతను ఈ భూమిపైకి వచ్చిన కార్యం పూర్తవడానికి రెండు పుష్కరాల సమయం పడుతుందనీ, ఆ తరువాత అతను సమాధి చేయబడతాడని ఆ శక్తి చెబుతుంది. ఆ గండం నుంచి అతనిని గట్టెక్కించమని అందరి దేవుళ్లకి ఆ తల్లి దణ్ణం పెట్టుకుంటూ ఉంటుంది. అతను వయసులోకి అడుగుపెట్టిన తరువాత జయమ్మ (రష్మిక)తో వివాహాన్ని జరిపిస్తుంది.



'క్రేజీ కళ్యాణం' మూవీ రివ్యూ

ప్రస్తుతం తెలుగు సినీ పరిశ్రమలో తెలంగాణ సినిమా నేపథ్య సినిమాల పరంపర కొనసాగుతోంది. అందులో భాగంగా తెలంగాణ నేపథ్యంలో తెరకెక్కిన మరో సినిమా 'క్రేజీ కళ్యాణం', అనుపమ పరమేశ్వరన్, అఖిల్ రాజ్, తరుణ్ భాస్కర్, నరేష్ ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రం ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది? ఇక ఈ 'క్రేజీ కళ్యాణం' కథ ఏమిటి? ఈ సినిమా ప్రేక్షకులను అలరించిందా? ఈ సినిమా ఎలాంటి వినోదాన్ని పంచింది. పర్వతాలు (నరేష్ వీకే)కు ఇద్దరు కూతుళ్లు. పెద్ద కూతుర్ని బాలరాజు (తరుణ్ భాస్కర్)కి ఇచ్చి పెళ్లి చేస్తాడు. కానీ బాలరాజు పని పాటా లేకుండా మద్యానికి బానిసై ఊళ్లో అప్పులు చేస్తూ ఇల్లరికం ఉంటూ ఇంటికిపైకి రోజుకో గొడవ తెచ్చిపెడుతుంటాడు. దీంతో పర్వతాలు ఊళ్లో పెద్దల్లుడు వల్ల తన పరువంతా పోయిందని, ఊళ్లో తలెత్తుకోలేకుండా ఉండాల్సి వస్తుందని బాధపడుతుంటాడు. అందుకే తన చిన్న కూతురు కీర్తి (అనుపమ పరమేశ్వరన్)కి గొప్పింటి సంబంధం చూసి మంచి గుణం, ఎటువంటి చెడు అలవాట్లు లేని అబ్బాయికి ఇచ్చి ఘనంగా పెళ్లి చేసి ఊర్లో పోయిన పరువును తిరిగి కాపాడుకోవాలని అనుకుంటాడు. అయితే ఇందుకోసం తన అన్న కూతురుకు వచ్చిన అమెరికా సంబంధాన్ని చెడగొట్టి, ఆ అబ్బాయికి కీర్తికి ఇచ్చి పెళ్లి చేయాలని ప్లాన్ చేస్తాడు.



PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.